జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ‖సంపుటి:1 ‖ సంచిక: 52 ‖ ఆదివారం ‖ 19-7-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-

19 జూలై 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:55 సూర్యాస్తమయం - సా. 6:49 తిథి షష్ఠి తె. 3:32o వరకు తరువాత సప్తమి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం ఉత్తర ఫల్గుని(ఉత్తర) సా. 6:12 వరకు తరువాత హస్త యోగం పరిఘ రా. 7:21 వరకు కరణం కౌలవ మ. 3:36 వరకు తైతుల తె. 3:32o వరకు వర్జ్యం రా. 2:55 నుండి తె. 4:35 వరకు దుర్ముహూర్తం సా. 5:06 నుండి సా. 5:58 వరకు రాహుకాలం సా. 5:12 నుండి సా. 6:49 వరకు యమగండం మ. 12:22 నుండి మ. 1:59 వరకు గుళికాకాలం మ. 3:36 నుండి సా. 5:12 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:19 నుండి తె. 5:07 వరకు అమృత ఘడియలు ఉ. 10:55 నుండి మ. 12:32 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## దేశానికే ఆదర్శంగా తెలంగాణ పీసీసీ

### మీనాక్షి నటరాజన్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) సంస్థాగత పనితీరు దేశంలోని ఇతర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలకు ఆదర్శంగా నిలిచిందని ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. శనివారం గాంధీభవన్‌లో పార్టీ సంస్థాగత కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన ఆమె, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

హైదరాబాద్, జూలై 18 సంఘటన్ సృజన్ అభియాన్, జై బాపు--జై భీమ్ కార్యక్రమాలు, మేనేజరా, డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరాలు, ఎస్ఐఆ ర్ కార్యక్రమాలు, బీఎల్ఏల నియామకాలు, జిల్లా--మండల కమిటీల ఏర్పాటు వంటి కార్యక్రమాలను ఆమె ప్రత్యేకంగా ప్రశంసించారు. పార్టీ సంస్థాగత సమన్వయాన్ని బలోపేతం చేయడంలో ఏఐసీసీ కనెక్టింగ్ సెంటర్ చైర్మన్ సెంథిల్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, పీసీసీ కార్యాలయ ఇన్‌చార్జి పి. ప్రసన్న కుమార్ శర్మ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ప్రతి నెలా పార్టీ కార్యకలాపాలపై సమగ్ర నివేదికలను ఏఐసీసీకి



# ఆహార, ఔషధ కల్తీ నియంత్రణకు కఠిన చట్టం తీసుకురావాలి

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

రాష్ట్రంలో పెరుగుతున్న ఆహార పదార్థాలు, ఔషధాల కల్తీని అరికట్టేందుకు కఠినమైన చట్టాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ సంస్థలో తెలంగాణ ఫుడ్ అడల్టరేషన్ అండ్ డ్రగ్ కంట్రోల్ యాక్ట్ (౧+ఖౌణజూ)పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కూరగాయలు, పండ్లు, పాలు తదితర ఆహార పదార్థాల్లో విస్తృతంగా కల్తీ జరగడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

హైదరాబాద్, జూలై 18 ఆకుకూరలు, కూరగాయలు, పాల నిల్వ కాలాన్ని పెంచేందుకు విచక్షణారహితంగా రసాయనాలు ఉపయోగించడం, పండ్లను కృత్రిమంగా మగ్గించడం వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. అలాగే ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం కారణంగా పంటల్లో మిగిలే రసాయన అవశేషాల వల్ల విదేశీ దేశాలు మన వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను నిరాకరిస్తున్నాయని పేర్కొన్నారు. 'ఆర్గానిక్' పేరుతో మార్కెట్లో విక్రయిస్తున్న ఉత్పత్తులను ప్రజలు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నప్పటికీ, అవి నిజంగా సేంద్రియ ఉత్పత్తులేనా అనే విషయాన్ని నిర్ధారించే వ్యవస్థ ప్రస్తుతం లేదని ముఖ్యమంత్రి తెలిపారు.ఆహార, ఔషధ కల్తీ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో కల్తీని సమర్థవంతంగా అరికట్టిన (మిగతా 2వ పేజీలో)

# సూపర్ ఎల్‌నినో ముప్పుపై అప్రమత్తం

**వర్షాభావ పరిస్థితులకు ప్రభుత్వం సిద్ధం.. వాతావరణ మార్పులకు అనుగుణంగా నీటి నిర్వహణలో కొత్త వ్యూహాలు: ఉత్తమ్**

వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న "సూపర్ ఎల్‌నినో" ప్రభావంతో ఈ ఏడాది రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉన్న నేపథ్యంలో, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందస్తు కార్యాచరణతో సిద్ధమవుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్, జూలై 18 శనివారం హైదరాబాద్‌లో ని హోటల్ అవాసాలో "సింపోజియం" అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వ ర్యంలో నిర్వహించిన వాతావరణ మార్పులపై సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ఇప్పటికే వాతావ రణ మార్పుల ప్రభావాన్ని అనుభవిస్తోందన్నారు. గతంలో నమోదైన వర్షపాత నమూనాల ఆధారంగా ఇకపై నీటి వనరుల ప్రణాళికలు రూపొందించడం సాధ్యం కాదని (మిగతా 2వ పేజీలో)



## రోటరీ క్లబ్ సేవలు ఆదర్శనీయం

### స్కిల్ ట్రైనింగ్ సెంటర్ విద్యార్థులకు ఉపయోగము

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు

విజయనగరం, జూలై 18, రోటరీ క్లబ్ సేవలు ఆదర్శనీయమని, విజయనగరంలో గత 67 సంవత్సరాలుగా రోటరీ క్లబ్ సేవలు అందించడం గర్వకారణంగా ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత తరువాయి 2 వ పేజీలో...



## విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### శ్రీకాకుళం షైనింగ్ స్టార్ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారికి ఆహ్వానం

విజయనగరం, జులై 18, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శ్రీకాకుళం ఇన్చార్జి మంత్రివర్యులు, రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు సూచించారు. శ్రీకాకుళంలో నిర్వహించే సైనింగ్ స్టార్ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ తరఫున డీఈవో రవిబాబు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారిని కోరడం జరిగింది. శనివారం విజయనగరంలోని మంత్రి గారి కార్యాలయంలో శ్రీకాకుళం డీఈవో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మంత్రి నారా లోకేష్ గారి సారథ్యంలో దేశంలోనే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మెరుగైన విద్యకు దిక్సూచిగా మారాలని చేసే ప్రయత్నంలో ప్రతి ఒక్కరు కూడా సహకరించాలని మంత్రి విద్యాశాఖ అధికారులకు సూచించారు. శ్రీకాకుళం జిల్లాలో 20వ తేదీ సోమవారం నిర్వహించే షైనింగ్ స్టార్ కార్యక్రమానికి తప్పనిసరిగా విచ్చేసి చిన్నారులను ఆశీర్వదించాలని మంత్రి గారిని కోరారు. జిల్లావ్యాప్తంగా పదవ తరగతికి చెందిన 187 మంది, ఇంటర్మీడియట్ కి చెందిన 37 మంది విద్యార్థులను షైనింగ్ స్టార్స్ గా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీ చంద్రభూషణ్, సన్యాసిరాజు పాల్గొన్నారు.



# యువతకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

## రాహుల్‌ను ప్రశ్నించిన కేటీఆర్

తెలంగాణ నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రశ్నించారు. యువతకు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజలే రాజకీయ మరణశాసనం రాస్తారని ఆయన అన్నారు.

హైదరాబాద్, జూలై 18 శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన యువ సంగ్రామ సభలో కేటీఆర్ ప్రసంగించారు. ఇదే వేదికపై మూడేళ్ల క్రితం కాంగ్రెస్ ప్రకటించిన యూత్ డిక్లరేషన్లోని ప్రధాన హామీల్లో ఒక్కటీ నెరవేరలేదని విమర్శించారు. రాహుల్ గాంధీని ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ, "మీకు తెలుగు అర్థం కాకపోవచ్చు కాబట్టి మీకు అర్థమయ్యే భాషలోనే అడుగుతున్నాను. అశోక్‌నగర్‌లో నిరుద్యోగ యువతను కలిసి మొదటి ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైంది? జాబ్ క్యాలెండర్ ఎక్కడుంది? నెలకు రూ. 4 వేల (మిగతా 2వ పేజీలో)



## విక్రమ్-1తో చరిత్ర

### స్కైరూట్‌కు సీఎం శుభాకాంక్షలు

హైదరాబాద్‌కు చెందిన అంతరిక్ష సాంకేతిక సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన భారత తొలి ప్రైవేట్ ఆర్బిటల్ లాంచ్ వెహికల్ 'విక్రమ్-1' విజయవంతంగా ప్రయోగం కావడంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంస్థ బృందానికి అభినందనలు తెలిపారు.

హైదరాబాద్, జూలై 18 ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడు తూ, విక్రమ్-1 విజయం తెలంగాణతో పాటు దేశానికే గర్వకారణమని పేర్కొన్నా రు. ఈ ఘనతతో(మిగతా 2వ పేజీలో)




## ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూలై 18 ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో భవిష్యత్తులో విద్యుత్ డిమాండ్ పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని టీజీఎస్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన ఇంధన శాఖ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎలాంటి పరిస్థితుల్లోనైనా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందేలా (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

మేషం: వృత్తి వ్యాపార రంగంలో అనుకూలమైన మార్పులు ఉంటాయి. చేపట్టిన ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. అయితే, విలాస వస్తువుల కొరకు ఖర్చులు పెరిగే అవకాశం ఉంది కాబట్టి పొదుపుపై దృష్టి పెట్టండి. కుటుంబంలో ప్రశాంత వాతావరణం నెలకొంటుంది.

వృషభం: వ్యాపార రంగంలో ఉన్నవారికి నూతన పెట్టుబడులు లేదా ఒప్పందాలు అనుకూలిస్తాయి. నిలిచిపోయిన పాత బాకీలు వసూలవుతాయి. ఆరోగ్యం పట్ల కొద్దిగా శ్రద్ధ వహించడం మంచిది. బంధుమిత్రుల రాక ఇంట ఆనందాన్ని ఇస్తుంది.

మిధునం: కార్యాలయంలో పని ఒత్తిడి కొద్దిగా పెరిగినప్పటికీ, సహనంతో పనులను పూర్తి చేస్తారు. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నాయి. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు తొందరపాటు వద్దు. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది.

కర్కాటకం: సమాజంలో మీ గౌరవ మర్యాదలు పెరుగుతాయి మరియు కీర్తి ప్రతిష్టలు దక్కుతాయి. వ్యాపారంలో ఆశించిన స్థాయిలో మంచి లాభాలు పొందుతారు. జీవితభాగస్వామితో సంతోషంగా గడుపుతారు మరియు మీ మధ్య ఉన్న బంధం మరింత బలపడుతుంది.

సింహం: ఉద్యోగ రంగంలో నూతన అవకాశాలు లభిస్తాయి. పూర్తి ఆత్మవిశ్వాసంతో పనులను ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తారు. కోపాన్ని అదుపులో ఉంచుకోవడం వల్ల సహోద్యోగులతో విభేదాలు రాకుండా చూసుకోవచ్చు. ఆర్థిక పరిస్థితి బాగుంటుంది.

కన్య: దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కారమవుతాయి. మీ ప్రతిభకు తగిన గుర్తింపు మరియు పై అధికారుల నుండి ప్రశంసలు లభిస్తాయి. ఆర్థికంగా స్థిరత్వం ఉంటుంది. పాత స్నేహితులను కలుసుకోవడం మనస్సుకు ఉల్లాసాన్ని ఇస్తుంది.

తుల: ఈరోజు మిశ్రమ ఫలితాలు ఉంటాయి. చేపట్టిన పనులలో కొన్ని చిన్నపాటి ఆటంకాలు ఎదురైనా, ఓర్పుతో వాటిని అధిగమిస్తారు. అనవసర ఖర్చులు పెరగకుండా చూసుకోవాలి. ముఖ్యమైన విషయాల్లో కుటుంబ పెద్దల సలహాలు తీసుకోవడం శ్రేయస్కరం.

వృశ్చికం: ఆకస్మిక ధనలాభ సూచనలు బలంగా ఉన్నాయి. నూతన పరిచయాలు ఏర్పడతాయి. ఇవి భవిష్యత్తులో మీ వ్యాపార అభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయి. శారీరక దృఢత్వం బాగుంటుంది మరియు రోజంతా ఎంతో ఉత్సాహంగా గడుపుతారు.

ధనస్సు: బంధువుల నుండి ఒక శుభవార్త వినే అవకాశం ఉంది. వృత్తి ఉద్యోగాల్లో ఆశించిన పురోగతి స్పష్టంగా కనిపిస్తుంది. ఇంట్లో సంతోషకరమైన వాతావరణం నెలకొంటుంది. దైవదర్శనాలు మరియు ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

మకరం: అనవసర వివాదాలకు మరియు ఇతరుల విషయాలకు దూరంగా ఉండటం ఎంతైనా మంచిది. ఆదాయానికి మించి ఖర్చులు పెరిగే అవకాశం ఉంది కాబట్టి బడ్జెట్ ప్రకారం నడుచుకోండి. ఆహార నియమాల విషయంలో జాగ్రత్త వహించి, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి.

కుంభం: ఇంటాబయట అనుకూలత పెరుగుతుంది. ప్రయాణాలలో కొత్త వ్యక్తుల పరిచయాలు కలుగుతాయి. వ్యాపార ప్రారంభానికి శ్రీకారం చుడతారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలలో విజయం లభిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలు లభిస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.

మీనం: చేపట్టిన పనులలో శ్రమ అధికంగా ఉన్న మిత్రుల సహాయ సహకారాలతో పూర్తిచేస్తారు. భూ వివాదాలు పరిష్కారంతో ఊరట పొందుతారు. వాహన క్రయ విక్రయాలలో లాభాలు అందుతాయి. సంతాన విద్యా విషయంలో శుభవార్తలు అందుతాయి. నిరుద్యోగులకు అధికారుల అనుగ్రహంతో నూతన అవకాశాలు లభిస్తాయి.






# రోటరీ క్లబ్ సేవలు ఆదర్శనీయం

మొదటి పేజీ తరువాయి

సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం రోటరీ స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ యువత ఉపాధి అవకాశాలను పెంపొందించే దిశగా రోటరీ క్లబ్ మరియు జేఎస్ఎస్ (జీూా) సంయుక్త ఆధ్వర్యంలో నూతన ఒకేషనల్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగమన్నారు. ఇప్పటికే రోటరీ ద్వారా జిల్లాలో రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, స్వర్గధాం, ఆరో ప్లాంట్స్ వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను నిరంతరం అందిస్తూ సమాజ శ్రేయస్సుకు రోటరీ ఎంతో కృషి చేస్తోందని కొనియాడారు. 2017-18 కాలంలో తాను కూడా రోటరీ క్లబ్ మెయిన్ సెక్రటరీగా పనిచేసిన రోజులను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. రోటరీ సంస్థ సభ్యులలో నాయకత్వ లక్షణాలను, సమాజం పట్ల బాధ్యతను పెంపొందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రస్తుతం ప్రారంభించిన ఈ శిక్షణ కేంద్రంలో ప్రాథమికంగా టాలీ అకౌంటెంట్స్ మరియు బ్యూటీషియన్ కోర్సులను ప్రారంభించడం అభినందనీయమన్నారు. యువతలో నమ్మకాన్ని, నైపుణ్యాన్ని నింపేలా జేఎస్ఎస్ సంస్థ ఈ శిక్షణను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రిగారు పిలుపునిచ్చారు. భవిష్యత్తులో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాలు కలిసిపోయి అద్భుతమైన నగరంగా ఆవిర్భవించబోతున్నాయని మంత్రిగారు ఆశాభావం వ్యక్తం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఈ ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లోనే ఒక ప్రధానమైన 'బిజినెస్ క్యాపిటల్'గా మారనుందని తెలిపారు. ఇప్పటికే మన హెడ్‌క్వార్టర్స్‌లో అన్ని రకాల సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని, మారుతున్న కాలానికి అనుగుణంగా యువత ఒకేషనల్ కోర్సులపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త ఆశయంతో ముందుకు సాగుతుందన్నారు. ఇందులో భాగంగానే స్వయం ఉపాధి, వృత్తి విద్యా నైపుణ్యాల కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందన్నారు. ఇదే క్రమంలో జేఎన్‌టీయూ (జీచీుఖ) భాగస్వామ్యంతో రోటరీ సంస్థ చేపట్టే ఇలాంటి మంచి నైపుణ్య శిక్షణా కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ఉచితంగా స్థలాన్ని అందించిన కిరణ్ గారికి, విరాళాలు అందించిన ఎన్నారై హాస్పిటల్ మరియు చలసాని గ్రూప్ వారికి ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమానికి ముందుగా రోటరీ క్లబ్ సభ్యులు మేళతాళములతో, రోటరీ చేస్తున్న ప్లకార్డుల ప్రదర్శనతో స్వాగతం పలికారు. స్కిల్ సెంటర్ ప్రారంభించి కంప్యూటర్ లు ఆన్ చేశారు. ఈ సందర్భంగా సెంటర్కు విచ్చేసిన విద్యార్థినులతో రోటరీ ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని, మంచి తర్ఫీదును పొంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు జి జగదీష్ బాబు, కార్యదర్శి బత్తుల చందు, ఒకేషనల్ సర్వీస్ డైరెక్టర్ మంచుకొండ అశోక్, చలసాని టీం దర్శిపూడి రమేష్, జె ఎస్ ఎస్ టీమ్ రమేష్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# విక్రమ్-1తో చరిత్ర

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ ఏరోస్పేస్ ఆవిష్కరణలు, డీప్-టెక్నాలజీ రంగాల్లో దేశంలో అగ్రగామి కేంద్రంగా మరోసారి నిలిచిందన్నారు. "ఆకాశాన్ని లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతున్న భారతదే శానికి ఇది గర్వించదగ్గ రోజు. భారత అం తరిక్ష కలలు సాకారమయ్యే నేల తెలం గాణ. స్కైరూట్ బృందానికి హృదయపూ ర్వక శుభాకాంక్షలు. హైదరాబాద్ ఆవిష్కరణల పర్యావరణం దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తోంది" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

'మిషన్ ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగంలో ఏడు అంతస్తుల ఎత్తు, నాలుగు దశలతో కూడిన విక్రమ్-1 రాకెట్ శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పూర్తవగా, సుమారు 450 కిలోమీటర్ల ఎత్తులోని లో ఎర్త్ ఆర్బిట్ (ూజుూ) లో సాంకేతిక ప్రదర్శన పేలోడ్లను విజయవంతంగా ప్రవేశపెట్టింది.

పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో రూపొందించిన ఈ రాకెట్‌లో మూడు ఘన ఇంధన దశలు, అలాగే అంతరిక్షంలో పలుమార్లు పునఃప్రారంభించగల 3డీ ప్రింటెడ్ ఇంజిన్‌తో కూడిన ద్రవ ఇంధన ఆధారిత ఆర్బిటల్ అడ్జస్ట్‌మెంట్ మాడ్యూల్ (ూూవీ) అమర్చారు. ఈ విజయంతో భారతదేశంలో ప్రైవేట్ రంగం నుంచి కక్ష్యలోకి రాకెట్‌ను విజయవంతంగా ప్రవేశపెట్టిన తొలి సంస్థగా స్కైరూట్ ఏరోస్పేస్ నిలిచింది. భారత అంతరిక్ష విధానంలో వాణిజ్య భాగస్వామ్యాన్ని విస్తరించాలనే లక్ష్యానికి ఈ ప్రయోగం కీలక మైలురాయిగా నిలిచింది.

వాణిజ్య పేలోడ్లతో పాటు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వహస్తాలతో రాసిన "వందే మాతరం" సందేశంతో కూడిన పోస్టుకార్డును కూడా ఈ రాకెట్ అంతరిక్షంలోకి తీసుకెళ్లడం విశేషం.

# సూపర్ ఎల్‌నినో ముప్పుపై అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. డిసెంబర్ 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా అనుకూల రుతుపవనాలు కురవడంతో జలాశయాలు సమృద్ధిగా నిండాయని, సాగు నీరు, తాగునీటి సరఫరా సజావుగా సాగిందన్నారు. అయితే ఈ ఏడాది పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని పేర్కొన్నారు.

సంక్షోభం ఏర్పడిన తర్వాత చర్యలు తీసుకునే విధానానికి బదులుగా ముందస్తు ప్రణాళికతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. నీటిపారుదల, వ్యవసాయం, తాగునీరు, పౌర సరఫరాల శాఖలు సమన్వయంతో ప్రత్యామ్నాయ కార్యాచరణను అమలు చేస్తున్నాయని చెప్పారు.

వాతావరణ మార్పుల ప్రభావంతో రాష్ట్రంలో జలాశయాల నీటి మట్టాలు హెచ్చుతగ్గులకు గురవడం, సాగునీటి చక్రాలు మారడం, నీటి లభ్యతలో అనిశ్చితి, పంటల సాగు విధానాల్లో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

గత అనుభవాలపై ఆధారపడకుండా, వాతావరణ మార్పులకు అనుగుణంగా నీటిపారుదల వ్యవస్థలను పునర్‌రూపకల్పన చేయాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణ జలాశయ నిర్వహణ, శాస్త్రీయ నిర్ణయాలు, నీటిపారుదల--వ్యవసాయ శాఖల మధ్య సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

వాతావరణ మార్పుల వల్ల ఏర్పడుతున్న అనిశ్చిత పరిస్థితుల నుంచి రైతులను రక్షించడమే ప్రభుత్వాల అసలైన పనితీరుకు కొలమానమని మంత్రి పేర్కొన్నారు. ఆలస్యంగా వచ్చే రుతుపవనాలు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు ముందుగానే సిద్ధంగా ఉండాలని, ప్రజలకు ప్రభుత్వం తమ వెన్నంటే ఉందనే నమ్మకం కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

## ఆహార, ఔషధ కల్తీ నియంత్రణకు కఠిన చట్టం తీసుకురావాలి

(మొదటి పేజీ తరువాయి)

దేశాలను అధికారులు సందర్శించి, అక్కడ అమలులో ఉన్న కఠిన చట్టాలు, విధానాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆ అధ్యయనం ఆధారంగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రజాభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని శాసనసభలో చర్చించి కొత్త చట్టానికి బిల్లును రూపొందిస్తామని ప్రకటించారు.

మొదటి దశలో జఖ=జు ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా కల్తీ నిరోధక చర్యలను అమలు చేయాలని, అమలులో ఎదురయ్యే లోపాలను గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని అధికారులకు సూచించారు. అలాగే కల్తీపై సమాచారం అందించే విసిల్‌బ్లోయర్లను నియమించడంతో పాటు, ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శులు వి. శేషాద్రి, ఎన్. శ్రీధర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలు, వ్యవసాయ రంగానికి ఎట్టి పరిస్థితుల్లోనూ నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగించాలని భట్టి స్పష్టం చేశారు. భవిష్యత్తులో విద్యుత్ రంగం ఎదుర్కొనే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, డిస్కంలలో ఆర్థిక క్రమశిక్షణ పెంపొందించేందుకు ఆదాయ వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ రాష్ట్రంలోని ప్రతి వినియోగదారునికి నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సేవలు అందించేందుకు సమగ్ర వ్యూహంతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు.

రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు దశలవారీగా సౌర విద్యుత్ సౌకర్యం కల్పించే ప్రణాళిక రూపొందించాలని భట్టి ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో ఏర్పాటు చేసిన ఆదర్శ సబ్‌స్టేషన్ నమూనాను అనుసరించి టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్లను దశలవారీగా ఆధునీకరించాలని సూచించారు.

గ్రేటర్ హైదరాబాద్‌లోని కొండాపూర్, గచ్చిబౌలి, మాధాపూర్ ప్రాంతాల్లో భూమి కొరత ఉన్నందున మున్సిపల్ శాఖతో సమన్వయం చేసుకుని ఫ్లైఓవర్ల కింద సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

'108' అత్యవసర సేవల తరహాలో అమలు చేస్తున్న పవర్ అంబులెన్స్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ఆదేశించారు. ఇప్పటికే 21 సర్కిళ్లలో 168కు పైగా వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అమర్చడం, ఎర్రగడ్డ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా వేగవంతమైన సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జ్యోతి బుద్ధప్రకాశ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గత 30 నెలల్లో చేపట్టిన సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన పురోగతిని వివరించారు. ఫీడర్--డీటీఆర్--వినియోగదారుల మ్యాపింగ్ వ్యవస్థ వల్ల విద్యుత్ అంతరాయాలను వెంటనే గుర్తించడం, త్వరితగతిన పునరుద్ధరణ, ఫిర్యాదుల పరిష్కారం, కచ్చితమైన ఎనర్జీ ఆడిటింగ్ సాధ్యమవుతోందని తెలిపారు.

# యువతకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

(మొదటి పేజీ తరువాయి)

నిరుద్యోగ భృతి ఏమైంది? కళాశాల విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు, యువతకు వడ్డీలేని రుణాలు తదితర హామీలు ఎందుకు అమలు కాలేదు?" అని ప్రశ్నించారు. ఉద్యోగాల కోసం ఆందోళన చేస్తున్న నిరుద్యోగ యువతపై పోలీసులు లాఠీచార్జి చేయడం, అరెస్టులు చేయడం, కేసులు నమోదు చేయడంపై కూడా రాహుల్ గాంధీ ఎందుకు మౌనంగా ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా రాజ్యాంగం గురించి మాట్లాడే రాహుల్, తెలంగాణలో తమ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోరుతున్న యువతపై జరుగుతున్న చర్యలపై స్పందించకపోవడం ఎందుకని నిలదీశారు. కాంగ్రెస్ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ ఇప్పుడు మోసపూరిత ప్రకటనగా మారిందని, తెలంగాణ యువత కాంగ్రెస్‌కు రాజకీయ మరణశాసనం రాసిందని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రధాన ఉద్యోగ హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంపై మరోసారి విరుచుకుపడిన కేటీఆర్, "నోటిఫికేషన్లు లేవు... దోపిడీలే ఉన్నాయి" అంటూ ఆరోపించారు. ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం అవినీతి, కుంభకోణాల్లో మునిగిపోయిందని, పాలన క్యాలెండర్‌కు బదులుగా కుంభకోణాల



క్యాలెండర్ నడుస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువతకు ఉద్యోగాలు కల్పించడంపై కన్నా కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకోవడంపైనే దృష్టి పెట్టారని విమర్శించారు. కొత్త నియామకాల ద్వారా 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని ఆధారాలతో నిరూపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. ప్రభుత్వం ఆ వాదనను సాక్ష్యాలతో నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు.

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ పీసీసీ

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారని, ఈ విధానాన్ని తమ రాష్ట్రాల్లోనూ అమలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని మీనాక్షి నటరాజన్ తెలిపారు. బూత్ స్థాయి పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను అప్రమత్తంగా అమలు చేయడంతో పాటు బీఎల్ఏల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని పార్టీ నాయకులకు సూచించారు. టీపీసీసీ పనితీరును ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ కూడా అభినందించినట్లు ఆమె వెల్లడించారు.

శ్వేత

## సంపాదకీయం

**ఆదివారం 19-7-2026**

# కాళేశ్వరం...ఆత్మరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం!

దొంగలుపడ్డ ఆరు నెలలకు ...అన్న చందంగా ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్న తరుణంలో ఇప్పుడు ధరణిపై విచారణకు ఓ కమిటీని వేయాలని రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయం నవ్వులు తెప్పించేదిగా ఉంది. కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతిపై పెద్దపెద్ద మాటలు మాట్లాడి అధికారంలోకి వచ్చిన రేవంత్ ఇప్పటి వరకు పైసా అవినీతిని నిరూపించ లేకపోయారు. కాళేశ్వరం, ధరణి, ఈ కార్ రేస్, పవర్ ప్లాంట్లు, విద్యుత్ ఒప్పందాలు తదితర అంశాలన్నీ ఇప్పుడు ప్రచార వస్తువుగా మారాయి. కేవలం బిఆర్ఎస్‌పై రాజకీయంగా పైచేయి సాధించేందుకు మాత్రమే విమర్శలు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా కాళేశ్వరం కూలేశ్వరం అంటూ చేసిన ఆరోపణల్లో ఇంచు కూడా ముందుకు కదలలేదు. లక్షకోట్లు పెట్టిన ప్రాజెక్ట్ పడావు పడ్డది. దానిని ఎలాగైనా వినియోగంలోకి తేవడం ద్వారా ప్రజాధనాన్ని కాపాడాలన్న ముందుచూపు లేకుండా పోయింది. ఎంతసేపు రాజకీయంగా విమర్శలు తప్ప ఈ ప్రభుత్వం గత బిఆర్ఎస్ చేసిన అవినీతిపై ఎలాంటి పురోగతి సాధించలేదు. రేవంత్ రెడ్డి దీనిని కేవలం రాజకీయంగా ఉపయోగించు కుని బిఆర్ఎస్‌ను భ్రష్టు పట్టించే యోచనలో ఉన్నారా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఎందుకంటే కాళేశ్వరాన్ని పక్కన పెట్టి ఇప్పుడు మళ్లీ ప్రాణహిత అంటూ పల్లవి అందుకున్నారు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం, వినిగింలోకి ఎలా తేవడం అన్న ఆలోచన పక్కన పెట్టారు. అందుకే నిత్యం కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం కొనసాగుతూనే ఉంది. రాజకీయ విమర్శలకు కాళేశ్వరం వేదికగా మారుతోంది. పరస్పర విమర్శలు తప్ప గోదావరి జలాలను ఎలా ఉపయోగించుకోవాలన్నది ఆలోచించడం లేదు. కాలేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల వ్యవహారం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య సవాళు ్లు, ప్రతిసవాళ్లు, పరస్పర ప్రజెంటేషన్లకు కేంద్రంగా మారింది.

ఎల్‌నినో ప్రభావంతో వానలు వెనక్కి పోయాయి. మరో వైపు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు తరలింపు అసాధ్యమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసినప్పటికీ మెడిగడ్డ వద్ద కొన్ని పిల్లర్లు కుంగడంతో ఇక అది పనికిరాదన్న రీతిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మోటర్లు, కాలువలు అంతా వృధా అవుతున్నాయి. ఇదే విషయాన్ని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ప్రస్తావిస్తే.. ఆయనను బిఆర్ఎస్ ఏజెంట్‌గా అభివర్ణించి విమర్శలతో దాడి చేశారు. నిజానికి గత 2023 శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమిలో కాళేశ్వరం, ధరణి అక్రమాలు ప్రధాన భూమిక పోషించాయి. అధికారంలోకి రావడానికి అనేకానేక హామీలు, వాగ్దానాలు గుప్పించిన రేవంత్ సర్కార్ ఇప్పుడు గుడ్డెద్దు చేలో పడ్డదన్నట్లుగా సాగుతున్నారు. పదికాలాలపాటు పనికి వచ్చే పనులు చేయడం లేదు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎలాంటి విధానం అనుసరిం చాలన్న దానిమీద సరైన అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారు. కాళేశ్వరం పిల్లర్లను పునరుద్దరించే ప్రయత్నాలు చేసి, నీటిని వినియోగంలోకి తీసుకుని వచ్చివుంటే, ఈయేడు మంచి ఫలితాలు వచ్చేవి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేది. కానీ కాళేశ్వరం ప్రాజెక్టను ఉపయోగించరాదన్న మొండి వైఖరితో రేవంత్ ఉన్నట్లుగా కనిపిస్తోంది.

ఆ ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని నేషనల్ డామ్ సేప్టి అథారిటి చెప్పిందని, అందువల్ల అక్కడ నీటిని వినియోగంలోకి తసీఉకుని రావడం అసాధ్యమని చెబుతున్నారు. కాళేశ్వరం ఎటిఎంగా మారిందని గతంలో బిజెపి కూడా ఆరోపించింది. రేవంత్ రెడ్డి కూడా ఇదే ప ÷-రచారం చేశారు. పోనీ అలాగని ఇందులో జరిగిన అవినీతిని వెలికితీసి కెసిఆర్ తదితరులను దోషులుగా నిలబెట్టి ఉంటే రేవంత్ ఇమేజ్ పెరిగేది. కానీ ఆరోపణలతోనే రెండున్నరేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. కాళేశ్వరం కమిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. జస్టిస్ పిసి ఘోష్ కమిటీ రిపోర్టుపై హైకోర్టు స్టే విధించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావులను అరెస్టు చేస్తారేమో అన్నంతగా ప్రచారం జరిగింది. అంతా తుస్సుమంది.

ఇప్పుడు కమిషన్ రిపోర్టుకు కూడా పెద్ద విలువ లేకుండా పోయిందా అన్న అనుమానాలు వస్తున్నాయి. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు బారేజీలైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద నీరు నిల్వచేసి పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని తోడి ఆయా ప్రాంతాలలో ఉన్న రిజర్వాయిర్‌లను నింపాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇందుకు రేవంత్ ససేమిరా అనడంతో చంద్రబాబు కోసం గోదావరి జలాలలను కిందికి జారవిడుస్తున్నారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఒక వైపు వర్షాభావ పరిస్థితులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల వర్షాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు నీరు ఎలా ఇవ్వవచ్చా అన్నదానిపై ఆలోచన చేసి ఉండాల్సింది. కేసీఆర్ కట్టించినంత మాత్రాన ఆ ప్రాజెక్టు కెసిఆర్‌ది అయిపోదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇప్పుడు రాజకీయంగా రేవంత్‌ను ఏకిపారేయడంలో బిఆరెస్ మెల్లగా పైచేయి సాధిస్తోంది. మంత్రులు అవినీతిలో కూరుకు పోయారని కెటిఆర్, హరీష్ రావులు రోజూ విమర్శలు చేస్తున్నారు. కమిషన్లు లేనిదే మంత్రులు కాలు బయటపెట్టడం లేదని అంటున్నారు. ఈ ఎదురుదాడితో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఓ రకంగా ఆత్మరక్షణలో పడిపోయింది. సింగరేణి తదితర విషయాల్లో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు అయ్యింది. ఈ క్రమంలోనే వాదోపవాదాలు, విమర్శ, ప్రతి విమర్శలతో రాజకీయ వేడెక్కింది. అవినీతి అంటూ ఆరోపించిన రేవంత్ నిరూపించలేదు. దీనికి బదులుగా కేటీఆర్, హరీష్‌రావులే గట్టిగా బదులు ఇస్తున్నారు. దీనివల్ల కూడా రేవంత్ అసహనానికి గురి అవుతున్నారనిపిస్తోంది. ఒక వేళ నిజంగానే గోదావరి నీటిని లిఫ్ట్ చేయడంలో ఇబ్బంది ఉంటే, ఎన్‌డిఎస్‌ఎ నివేదికపై అఖిలపక్షం నిర్వహించి చర్చ చేయాలి. బారేజీల వద్దకు, పంప్ హౌస్‌ల వద్దకు రిటైర్డ్ ఇంజనీర్లను తీసుకునివెళ్లి ఇరిగేషన్ అధికారుల ద్వారా పరిస్థితిని వివరించాలి. కానీ ఇవేవీ చేయకపోవడంతో ఇప్పుడు కాళేశ్వరమే బిఆర్ఎస్‌కు ఆక్సిజన్ నింపుతోంది.



# అక్టోబర్ 2 నాటికి చెత్తలేని ఏపీ

## రూ.15,274 కోట్ల పట్టణాభివృద్ధి పనులకు శ్రీకారం

### అసభ్య పోస్టులను సహించం

### 18వ స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

గుడివాడ, జూలై 18: స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా పరిశుభ్రమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇంటి నుంచే చెత్త రాకుండా నెట్ జీరో విధానాన్ని అలవాటు చేసుకోవాలని, కార్బన్ న్యూట్రల్ జీవన విధానాన్ని అవలంబించాలని, ఇంటిపై పడే వర్షపు నీటిని భూగర్భజలాలుగా మార్చుకునే చర్యలు తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా గుడివాడలో శనివారం నిర్వహించిన 18వ స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని 120 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రూ.15,274 కోట్ల విలువైన ప్రజారోగ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమానికి ముందు ప్రజా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ వర్క్స్ మానిటరింగ్ సిస్టమ్‌ను సీఎం పరిశీలించారు. మెప్మా మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను తిలకించారు. అనంతరం నెల్లూరు, కొండపల్లి, బేతంచర్ల, కమలాపురం, బద్వేల్, ఏలేశ్వరం, నర్సీపట్నం, పెద్దాపురం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ప్రారంభించారు. అలాగే ఉయ్యూరు, కుప్పం, నిడుదవోలు, బాపిరాజు, మదనపల్లి, విజయనగరం, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, గ్రేటర్ విశాఖ, నెల్లూరు కార్పొరేషన్లకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా



ఆపరేషన్ క్లీన్ స్వీప్ కాఫీ టేబుల్ బుక్ను ఆవిష్కరించారు. ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నానని, ఈసారి 18వ కార్యక్రమాన్ని గుడివాడలో నిర్వహిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. గుడివాడ దివంగత నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) తొలిసారిగా ప్రజాక్షేత్రంలో నిలబడిన ప్రాంతమని గుర్తుచేశారు. స్వచ్ఛమైన రాజకీయాలు, స్వచ్ఛమైన ప్రజాప్రతినిధులు, స్వాభిమానం లక్ష్యాలతో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని చెప్పారు. గతంలో స్వార్థ రాజకీయాలే ఉండేవని, ఎన్టీఆర్ అభివృద్ధి, సంక్షేమానికి నాంది పలికారని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగాల కల్పన, సంపద సృష్టినే లక్ష్యంగా పాలన సాగిస్తోందన్నారు.




### పరిశుభ్రతే ప్రజారోగ్యం

పరిశుభ్రత అంటే కేవలం రోడ్లు ఊడ్చడం కాదని, ప్రజారోగ్యం మెరుగుపడటం, పర్యావరణ పరిరక్షణ సాధించడమే అసలు లక్ష్యమని సీఎం చెప్పారు. గత పాలనలో చెత్తతో నిండిపోయిన ప్రాంతాలను ఇప్పుడు పరిశుభ్రంగా మార్చుతున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ జన్మస్థలాన్ని చెత్త రహితంగా ఉంచే బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రజలు సహకరిస్తేనే స్వచ్ఛత లక్ష్యం సాధ్యమవుతుందని, పచ్చదనం, పరిశు భ్రతతోనే స్వర్ణాంధ్ర నిర్మాణం పూర్తవుతుందని అన్నారు. తెలుగు జాతి భవిష్యత్తును రక్షించే బాధ్యత తాను తీసుకున్నానని, పూర్తి పారదర్శకంగా సుపరిపాలన అందిస్తున్నామని చెప్పారు. అవినీతిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, ప్రజా రాజధాని అమరావతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో జన్మభూమి కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారు స్పందించిన స్ఫూర్తి కొనసాగాలని ఆకాంక్షించారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, చెరువుల పునరుద్ధరణ, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి ద్వారా సురక్షితమైన తాగునీరు, మెరుగైన పారిశుధ్య వ్యవస్థను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

### అక్టోబర్ 2 నాటికి చెత్త రహిత రాష్ట్రం

ఇంటింటికీ చెత్త సేకరణ కోసం 126 ఎలక్ట్రిక్ ఆటోలను ప్రారంభించామని, త్వరలో మరో 1,104 ఈ-ఆటోలు అందుబాటులోకి వస్తాయని సీఎం వెల్లడించారు. రూ.528 కోట్లతో వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి కోసం రాష్ట్రంలో 8 ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంట్లో వ్యర్థాల వర్గీకరణ ప్రారంభించాలని ప్రజలకు సూచించారు. స్వచ్ఛ రథం ద్వారా వ్యర్థాల సేకరణ చేస్తూ రూ.16 కోట్ల విలువైన నిత్యావసర సరుకులు అందించామని చెప్పారు. గత ప్రభుత్వం వదిలేసిన 140 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించామని, అక్టోబర్ 2 నాటికి రాష్ట్రాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ పథం, ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వెల్లడించారు.

### 22 నుంచి తల్లికి వందనం

ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని సీఎం చెప్పారు. ఈ నెల 22 నుంచి 24 తేదీల మధ్య తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా పేదల పక్షాన నిలిచే మనసు ఉందన్నారు. ఆంగన్‌వాడీ సిబ్బంది, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పనిచేసే వారికి కూడా ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. 67,47,197 మంది విద్యార్థులకు సంబంధించిన రూ.10,122 కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించారు.

### తప్పు చేసిన వారిని వదిలిపెట్టం

గత పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, ప్రజలు సంతోషంగా జీవించే పరిస్థితి లేదని చంద్రబాబు విమర్శించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు రాజకీయ చెత్తను శుభ్రం చేశారని, బూతులు తిట్టిన వారి నోళ్లను ఓట్లతో కడిగేశారని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో క్రిమినల్ ధోరణులు, కుట్రలు, సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులు పెరిగాయని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై చేసిన పోస్టులను ప్రశ్నిస్తే భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో సమర్థించుకోవడం సరికాదన్నారు. ప్రజల జీవితాలకు ఆటంకం కలిగించే వారిని ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. శ్రీకాకుళంలో గొర్రెల కాపరిని బైక్‌తో ఢీకొట్టి చంపిన ఘటనలో బాధిత కుటుంబాన్ని ఆదుకోకుండా సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. గుంటూరులో ఇద్దరి మధ్య జరిగిన తగాదాలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఒక మహిళ పట్ల దుర్మార్గంగా ప్రవర్తించిన ఘటనలో వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసి, అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులను కూడా బదిలీ చేశామని, తప్పు చేసిన వ్యక్తి ఏ పార్టీకి చెందిన వారైనా ప్రభుత్వం ఒకే విధంగా వ్యవహరిస్తుందని, ఎవరినీ వదిలిపెట్టబోమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి. నారాయణ, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి, స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి



### లండన్‌లో ఎన్ఆర్ఐ బీసీ సెల్ నిరసన

**హైదరాబాద్, జూలై 18**

రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను విరమించుకోవాలని, రూ. 8,000 కోట్ల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, జీవో నెం. 9ను రద్దు చేసి గతంలో అమలులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఎంపీ ఆర్. కృష్ణయ్య చేపట్టిన సత్యాగ్రహానికి మద్దతుగా యూకేలోని ఎన్ఆర్ఐ బీసీ సెల్ లండన్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ బీసీ సెల్ యూకే అధ్యక్షుడు దుడిగం కిరణ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి లను విడుదల చేయకపోవడం వల్ల వేలాది మంది విద్యార్థుల ఉన్నత విద్యకు తీవ్ర ఆటంకం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబ ర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న రూ. 8,000 కోట్ల బకాయిలను ఎలాంటి జాప్యం లేకుండా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న జీవో నెం. 9ను వెంటనే రద్దు చేసి, గతంలో అమలులో ఉన్న ఫీజు రీయింబ ర్స్‌మెంట్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎన్ఆర్ఐ బీసీ నాయకులు నాగరాజు తౌటం, వేణు కలకోట, రవి ప్రదీప్ పులుసు, సునీల్ కొక్కొండ, హరి గౌడ్ నవపేట్, అనిల్ దాసారం, సురేందర్ యాదవ్, ఆదిత్య నాగిళ్ల, సాయి నవీన్ సాకేతపురం, కాసా క్రాంతి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొని ఆర్. కృష్ణయ్య చేపట్టిన సత్యాగ్రహానికి తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# తెలంగాణ ప్రజావాణి విధానాన్ని అధ్యయనం చేసిన మధ్యప్రదేశ్ తహసీల్దార్లు

**హైదరాబాద్, జూలై 18**




తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కార విధానాన్ని అధ్యయనం చేసేందుకు మధ్యప్రదేశ్‌కు చెందిన 26 మంది తహసీల్దార్లు శనివారం బేగంపేటలోని మహాత్మా జ్యోతిరావు ఫూలే ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సందర్శించారు. డాక్టర్ ఎం.సి.ఆర్. హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న ఈ అధికారులు ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా ప్రజావాణి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నోడల్ అధికారి కెవిద్యాసాగర్ ప్రజావాణి లక్ష్యాలు, సాంకేతికత ఆధారిత ఫిర్యాదుల ట్రాకింగ్ విధానం, ప్రజాకేంద్రీకృత సేవల గురించి వారికి వివరించారు. అధికారులు ఫిర్యాదుల నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు సంబంధిత అధికారులతో, ప్రజలతో మాట్లాడి వ్యవస్థ పనితీరును తెలుసుకున్నారు. ఒఈ సందర్భంగా తెలంగాణ ప్రజావాణి కార్యక్రమం పారదర్శకంగా, సమర్థవంతంగా, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థగా ఉ ఒదని మధ్యప్రదేశ్ తహసీల్దార్లు ప్రశంసించారు. ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదుల పురోగతిని తెలుసుకునే అవకాశం, శాఖల మధ్య సమన్వయం, ప్రత్యేక సహాయ కేంద్రాలు, వృద్ధులు, దివ్యాంగులకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలు ప్రజావాణి ప్రత్యేకతలుగా వారు పేర్కొన్నారు.

# మత్తు మందుల అక్రమ విక్రయం గుట్టురట్టు

### రూ.10 లక్షల విలువైన మాత్రలు, దగ్గు సిరప్ స్వాధీనం -- ఇద్దరు అరెస్ట్

**హైదరాబాద్, జూలై 18**



హైదరాబాద్ సిటీ పోలీసుల సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ప్రత్యేక నేరాల విభాగం, హబీబ్‌నగర్ పోలీసులతో కలిసి నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో మత్తు కోసం అక్రమంగా విక్రయిస్తున్న భారీ మొత్తంలో ప్రిస్క్రిప్షన్ ఔషధాలు, దగ్గు సిరప్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. అరెస్టైన వారు మల్లేపల్లికి చెందిన మహమ్మద్ సర్వర్ అలియాస్ రహీమ్ (30), మహమ్మద్ రబ్బానీ (32)గా పోలీసులు గుర్తించారు. ఈ కేసులో బీదర్‌కు చెందిన సరఫరాదారులతో పాటు మరో ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి నిట్రాజోహామ్, నిట్‌కోర్, నిట్రావెట్ బ్రాండ్‌లకు చెందిన 77,700 మాత్రలు, అలాగే చోకో ప్లస్ (జస్త్రశీఫిశీం) దగ్గు సిరప్ 170 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 10 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా, నిందితులు బీదర్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ ఔషధాలను తీసుకువచ్చి హైదరాబాద్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. మత్తు కోసం వీటిని అలవాటు పడిన వ్యక్తులు, నేర చరిత్ర కలిగిన వారు, యువత కొనుగోలు చేస్తున్నారని, ఈ మత్తు మందుల దుర్వినియోగం ఆస్తి నేరాలు, హింసాత్మక ఘటనలకు దారితీస్తోందని పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మాత్రలు నిద్రలేమి, గుండె సంబంధిత సమస్యలు, మూర్ఛ వంటి వ్యాధుల చికిత్సకు వైద్యుల సూచన మేరకు మాత్రమే వాడాల్సిన ఔషధాలని, దగ్గు సిరప్ కూడా వైద్య వినియోగం కోసమే ఉద్దేశించబడిందని పేర్కొన్నారు. వీటిని మత్తు కోసం వినియోగిస్తే మగత, తలతిరగడం, శరీర సమన్వయం కోల్పోవడం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇన్‌స్పెక్టర్ చి. సుధాకర్‌రావు నేతృత్వంలోని సీసీఎస్ ప్రత్యేక నేరాల బృందం, హబీబ్‌నగర్ పోలీసుల సహకారంతో ఈ దాడి నిర్వహించింది. ప్రజలు అనధికారిక వ్యక్తుల వద్ద నుంచి మందులు కొనుగోలు చేయవద్దని, ప్రిస్క్రిప్షన్ ఔషధాల అక్రమ విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# మహిళల ఆర్థిక సాధికారత ప్రభుత్వ ప్రాధాన్యత: ఎంపీ కడియం కావ్య

**హైదరాబాద్, జూలై 18**



మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబనకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ ఎస్సీ/ఎస్టీ ఇండస్ట్రియల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎస్ఐసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైజ్ హర్--26' మహిళా సాధికారత సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళా స్వయం సహాయక సంఘాలను ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోందని, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడం, పొదుపు అలవాటు పెంపొందించుకోవడం, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను స్మరించిన కడియం కావ్య, మహిళలు రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. విద్య, వ్యాపారం, ప్రజాజీవితంలో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆమె అభిప్రాయపడ్డారు. మహిళలు సాధికారత సాధిస్తే కుటుంబం, సమాజం, రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, పరిశ్రమలు--వాణిజ్య శాఖ అదనపు సంచాలకులు శ్రీనివాస్ నాయక్, పీఎంఈజీపీ అధికారి రవి, ఎస్‌బీఐ లీడ్ జిల్లా మేనేజర్ మూర్తి, వీ-హబ్ డైరెక్టర్ జావేద్ అఖ్తర్ షేక్, టీఎస్ఐసీసీ అధ్యక్షుడు నల్లా బాబు తదితరులు పాల్గొన్నారు.



## పోలాండ్ లో ఉన్న వ్యక్తికి బాసటగా నిలిచిన

# మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు

### బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన గారి సిఫార్సుతో చొరవ

### కుటుంబ సభ్యులకు ధైర్యం నింపిన మంత్రి గారు ఎమ్మెల్యే గారు

విజయనగరం, జులై 18, బొబ్బిలి నియోజకవర్గం, బాడంగి మండలం, రామచంద్రాపురం గ్రామానికి చెందిన బోగి వెంకటరమణ గారు పోలాండ్ దేశంలో వెల్డరుగా పనిచేయడానికి వెళ్లారు.. ఊపిరితిత్తులలో నీరు చేరడంతో చికిత్స నిమిత్తం పోలాండ్ ఆసుపత్రిలో చేరడం జరిగింది. ఆరోగ్య పరిస్థితి బలహీనం అవుతుండటంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు.. ఈ విషయాన్ని ఎంపీటీసీ శివ బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) గారి దృష్టికి తెలియపరిచారు. శనివారం స్వయంగా ఎమ్మెల్యే బేబీ నాయన గారు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారి వద్దకు భోగి వెంకటరమణ కుటుంబసభ్యులను తీసుకువచ్చి పరిస్థితిని వివరించి అతనిని స్వదేశానికి రప్పించడానికి ప్రభుత్వం తరుపున సహకరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు వెనువెంటనే ఎన్నార్టీ మరియు ఎంబసీ అధికారులతో మాట్లాడారు. ఆరోగ్యం కుదుటపడగానే వీలైనంత త్వరగా వెంకటరమణను ఇండియా తిరిగి వచ్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అప్పటివరకు కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు, ఎమ్మెల్యే బేబీ నాయన గారు సూచించారు.



# డయాబెటిక్ అండ్ అల్సర్ ఆసుపత్రి ప్రారంభం

### ఆంధ్ర రాష్ట్రంలో తొలి ఆసుపత్రి విజయనగరం లో పెట్టడం గర్వకారణం

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు

విజయనగరం జులై 18, అత్యాధునిక పద్ధతులలో నెలకొల్పబడిన తొలి డయాబెటిక్ అండ్ అల్సర్ ఆసుపత్రి ఆంధ్ర రాష్ట్రంలో విజయనగరం లో పెట్టడం గర్వకారణంగా ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం విజయనగరం100 అడుగుల రింగ్ రోడ్డులో ఎలిగేన్స్ డయాబెటిక్ ఫుడ్ అండ్ అల్సర్ క్లినిక్ ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు జ్యోతి ప్రజ్వలన చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ఒక అధునాతన 'ఫుట్ కేర్' (పాదాల సంరక్షణ) స్పెషాలిటీ హాస్పిటల్ కూడా ఇక్కడ ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. మహానగరాలకే పరిమితమైన ఇలాంటి సైంటిఫిక్ టెక్నాలజీ వైద్యం ఇప్పుడు విజయనగరంలో ఈ ప్రాంత ప్రజలకు అందించేందుకు చొరవ తీసుకోవటం పట్ల డాక్టర్ శ్రావణి ముద్దాడ, డాక్టర్ షిరిన్ పల్లి లను ప్రత్యేకంగా అభినందించారు. ఆస్పత్రి ఏర్పాటు మన ప్రాంత అభివృద్ధిని తెలియపరుస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు.



## ఘనంగా మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి

# పుట్టినరోజు వేడుకలు

హుజూర్నగర్ 10వ వార్డులో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి గారి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి . జగదీశ్వర్ రెడ్డి గారు కేసీఆర్ కి కుడి భుజంగా దీ=హా పార్టీలో అలాగే తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకమైన పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ శాఖ మంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా చేసిన సేవలు తెలంగాణ ప్రజలు మరువలేనివి . జగదీశ్వర్ రెడ్డి గారి మేధస్సు వలెనే ఈరోజు 24 గంటల విద్యుత్ సరఫరా జరుగుతున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఉంది అని దీ=హా పార్టీ 10 వ వార్డు నాయకులు సరస్వతి శ్రీనివాస్ రాజు గారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి కంఠం భారతి, కారింగుల మంగమ్మ, వీణ, శ్రీనివాస చారి, షేక్ రఫీ, బాల సైదా, ప్రఫుల్ రాజు, జడ గోపి, పచ్చిపాల గోపి, రోహిత్, రియాజ్ పాల్గొన్నారు.

# బ్యాగు భారం లేకుండా ఆనందంగా నేర్చుకున్న విద్యార్థులు



**చిలుకూరు, జూలై 18**

పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్), చిలుకూరులో శనివారం 'నో బ్యాగ్ డే' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు పుస్తకాల బ్యాగులు లేకుండా అనుభవాత్మక, ఆనందదాయక అభ్యసన కార్యక్రమాల్లో పాల్గొనడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం, ఆలోచనా శక్తిని పెంపొందించడం, బ్యాగు భారాన్ని తగ్గించి ఒత్తిడి లేకుండా ఆచరణాత్మకంగా నేర్చుకునే అవకాశాన్ని కల్పించడమే 'నో బ్యాగ్ డే' ప్రధాన ఉద్దేశమని ప్రధానోపాధ్యాయుడు రాజారావు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ముందస్తుగా ప్రణాళిక రూపొందించి, ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ చురుకుగా పాల్గొనేలా ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏకపాత్రాభినయాలు, నాటికలు, పాటలు, నృత్య ప్రదర్శనలు, గణిత నైపుణ్యాల ప్రదర్శనలు, భాషా కృత్యాలు, క్విజ్ పోటీలు, సైన్స్ ప్రయోగాలు నిర్వహించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఇటువంటి కార్యక్రమాలు పాఠశాల విద్యను మరింత ఆసక్తికరంగా, ప్రయోజనకరంగా మార్చడంతో పాటు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోదండరామయ్య, కైలాస్, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, రవికుమార్, రామారావు, చానిమియా, కస్తూరి అప్పారావు, అమిదాబి, రేణుక, శాంసన్‌తో పాటు బోధనేతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు.



## సర్ ప్రక్రియని వేగవంతం చేయాలి

చిలుకూరు మండలం రామాపురంలో ఏర్పాటు చేసిన సర్ ప్రక్రియలో భాగంగా ఎమ్మార్వో పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ను వేగవంతం చేయాలని తెలిపారు. ఓటర్లు తమ ఫారాలను నింపి బిఎల్ఓలకు అందజేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు బిఎల్వోలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ మంత్రి ప్రగడ సీతారామచంద్రరావు కాంగ్రెస్ నాయకులు హస్నా తదితరులు పాల్గొన్నారు

## తల్లిదండ్రుల సమన్వయంతోనే విద్యార్థుల విద్యా వికాసం





**నకిరేకల్, జూలై 18**

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమన్వయం ఎంతో అవసరమని నకిరేకల్ మండల విద్యాధికారి మేక నాగయ్య అన్నారు. శనివారం తాటికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఏదైనా కారణంతో విద్యార్థులు పాఠశాలకు రాలేని పరిస్థితి ఉంటే తప్పనిసరిగా ఉపాధ్యా యులకు సమాచారం అందించాలని కోరా రు. పాఠశాలలో విద్యార్థులు నేర్చుకుంటున్న అంశా లపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు అవగాహన కలిగి, ఇంటి వద్ద కూడా చదువుపై శ్రద్ధ పెట్టేలా ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, ప్రవర్తన తదితర అంశాలపై ఉపాధ్యాయులతో తరచూ చర్చించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు కారింగు శ్రీనివాస్, నీలం సైదులు, కొరివి సైదులు, బండమీది తమ్మయ్య, సిరికొండ భద్రయ్య, కారింగు ఆంజనేయులు, మన్నెం లక్ష్మయ్య, గద్దల అలివేలు పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న, పండుగ తిరుమలయ్య, మోసంగి హరీష్ చంద్ర, మార్త రాములు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి, నూకల జానయ్య, చింతమల్ల చరిష్మా తదితరులు హాజరయ్యారు.

## గాంధీ ఆస్పత్రి ఔషధాల కొనుగోళ్లపై సమగ్ర విచారణ చేపట్టాలి: పి.వై.ఎల్





**హైదరాబాద్, జూలై 18**

గాంధీ ఆస్పత్రిలో ఔషధాల కొనుగోళ్లలో చోటు చేసుకున్నట్లు వస్తున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పి.వై.ఎల్) డిమాండ్ చేసింది. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డి.ఎం.ఈ) కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా పి.వై.ఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బి.ఎస్. కృష్ణ, ప్రధాన కార్యదర్శి కొల్లూర్ భీమేష్ మాట్లాడుతూ.. గాంధీ ఆస్పత్రిలో లోకల్ పర్చేస్ పేరుతో రూ.7 కోట్ల విలువైన ఔషధాలకు రూ.13 కోట్ల బిల్లులు చూపించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రులకు కేటాయించే నిధులు ప్రజల పన్నుల రూపంలో వచ్చినవేనని, వాటిని పేదలకు మెరుగైన వైద్య సేవల కోసం వినియోగించాల్సిందిపోయి అవినీతికి పాల్పడటం తీవ్ర ఆందోళనకరమని అన్నారు. వైద్యారోగ్య శాఖ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔషధాల కొనుగోళ్లు తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఈ-టెండర్ విధానంలో జరగాల్సి ఉండగా, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే పరిమిత స్థాయిలో లోకల్ పర్చేస్‌కు అవకాశం ఉంటుందని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు, స్టాక్ రిజిస్టర్, బ్యాచ్ నంబర్లు, గడువు తేదీలు, ఆడిట్ నిబంధనలను ఉల్లంఘించి అధిక ధరలకు కొనుగోళ్లు, తప్పుడు బిల్లులు, నాసిరకం లేదా అవసరం లేని మందుల కొనుగోళ్లకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల పి.వై.ఎల్ నిర్వహించిన పరిశీలనలో గాంధీ ఆస్పత్రిలో అనేక సమస్యలు బయటపడ్డాయని నాయకులు తెలిపారు. రోగులకు పూర్తిస్థాయిలో మందులు ఇవ్వకుండా బయట ప్రైవేట్ మెడికల్ షాపుల నుంచి కొనుగోలు చేయాలని సూచిస్తున్నారని ఆరోపించారు. అత్యవసర వార్డుల వద్దే ప్రైవేట్ మందుల విక్రయం జరుగుతోందని, స్కానింగ్ సదుపాయాలు తగినంత లేక అత్యవసర రోగులు రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా కనీస అవసరమైన కాన్యులా, కాటన్, వీల్‌చైర్లు, బెడ్లు, బెడ్‌షీట్లు, సెలైన్ స్టాండ్లు కూడా సరిపడా లేవని ఆరోపించారు. ఎక్స్‌రే నివేదికలను మొబైల్‌లో ఫోటో తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొనడం వల్ల రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అత్యవసర విభాగంలో ఎక్కువగా జూనియర్ వైద్యులే అందుబాటులో ఉంటున్నారని, ఆస్పత్రిలోని టాయిలెట్లు అధ్వానంగా ఉన్నాయని, కొంతమంది సిబ్బంది టాయిలెట్ల నుంచి స్కానింగ్ కేంద్రాల వరకు వివిధ సేవల పేరుతో రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ మెడికల్ షాపుల్లో బిల్లులు ఇవ్వకుండా అధిక ధరలకు మందులు విక్రయిస్తున్నారని కూడా పేర్కొన్నారు.

ఈ సమస్యలన్నింటిపై ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణ చేపడతామని పి.వై.ఎల్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.వై.ఎల్ సహాయ కార్యదర్శి కుంభోజు కిరణ్, నాయకులు సీఎం సుధాకర్, కార్తీక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బండరామారం జడ్పీహెచ్ఎస్‌లో ఐదుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

**సూర్యాపేట, జూలై 18**

తుంగతుర్తి మండలం బండరామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరిపాలనా లోపాలు, విధుల్లో నిర్ల క్ష్యం, పాఠశాల ప్రతిష్ఠకు భంగం కలిగించిన ఘటనపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంది. ఈ మేరకు హెడ్‌మాస్టర్‌తో పాటు మరో నలుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా విద్యాశాఖాధికారి విడుదల చేసిన పత్రి కా ప్రకటన ప్రకారం, విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం, విద్యార్థుల నమోదు (ఎన్‌రోల్‌మెంట్) విషయంలో అలసత్వం, తప్పుడు సమాచారం అందించినందుకు హెడ్‌మాస్టర్ (ఎఫ్ఏసీ) ఎం.ఏ. హకీమ్‌ను జూలై 15న సస్పెండ్ చేశారు. అదే విధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూలై 18న స్కూల్ అసిస్టెంట్లు పి. కోటయ్య (గణితం), కె. సుజాత (తెలుగు), జి. గీత (బయో సైన్స్), ఎస్‌జీటీ కె. శ్రీనివాస్ నాయుడులను కూడా సస్పెండ్ చేశారు. విద్యార్థుల నమోదు పూర్తిగా సున్నాకు (జీరో ఎన్‌రోల్ మెంట్) చేరడం, ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు లేవని చెప్పి విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలు, హాస్టళ్ల వైపు మళ్లించినట్లు విచారణలో తేలిందని ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడం, పరస్పర ఆరోపణలు చేసుకోవడం, పాఠ శాల రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించకపోవడం వంటి అంశాలను తీవ్రంగా పరిగణించి ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడిం చారు. ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి భంగం కలిగించే చర్యలను జిల్లా యంత్రాంగం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని, ఈ ఘటనపై సమగ్ర విచా రణ కొనసాగుతోందని జిల్లా విద్యాశాఖాధికారి స్పష్టం చేశారు.



## ప్రైవేటు పాఠశాలలకు వత్తాసు పలుకుతున్న డీఈఓను సస్పెండ్ చేయాలి

**ఆవుల నాగరాజు పి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు**

**సూర్య పేట జూలై 20**

సూర్యాపేట జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఇటీవల ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నాగరాజు విమర్శించారు. నేడు సూర్యాపేట పి.ఎస్. యు కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు స్వచ్ఛందంగానే ఫీజులు చెల్లిస్తున్నారని, తమకు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, విద్యార్థి సంఘాలు సాధారణంగానే ఆరోపణలు చేస్తుంటాయని ఆయన వ్యాఖ్యానించడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను పరిరక్షించడం, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, ప్రైవేటు విద్యాసంస్థలు చట్టాలను ఉల్లంఘిస్తూ వ్యవహరిస్తే వాటిని అరికట్టడం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రధాన బాధ్యత అని గుర్తు చేశారు. అయితే ప్రజలు ఫిర్యాదు చేస్తేనే స్పందిస్తాననే ధోరణి అవలంబించడం ద్వారా తన రాజ్యాంగబద్ధ బాధ్యతలను విస్మరిస్తున్నారని విమర్శించారు. సమాజంలో ప్రజలు అనేక సందర్భాల్లో ఉన్నటువంటి పరిమితుల వల్ల అన్యాయాలను భరిస్తుంటారని, అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం చొరవ తీసుకుని ప్రజల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. కానీ సూర్యాపేట డీఈఓ ప్రైవేటు విద్యాసంస్థలపై పర్యవేక్షణ చేయడం, అధిక ఫీజులు, అక్రమ వసూళ్లు, చట్టవిరుద్ధ వ్యాపార పద్ధతులను అరికట్టడం వంటి బాధ్యతలను పక్కనబెట్టి, వాటిని సమర్థించే విధంగా మాట్లాడడం ఆందోళన కలిగించే అంశమన్నారు. విద్యార్థి సంఘాలు చేసే ఫిర్యాదులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం, విద్యలో సమాన అవకాశాల కోసం మాత్రమేనని స్పష్టం చేశారు. అలాంటి ఫిర్యాదులను పరిశీలించకుండా, "విద్యార్థి సంఘాలు జనరల్‌గా మాట్లాడు తుంటాయి" అని వ్యాఖ్యానించడం విద్యార్థి ఉద్యమాలను అవమానించ ్డమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలలపై వచ్చిన ఆరోపణలను నిష్పక్షపా తంగా విచారించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అధికారి, వాటికి అనుకూలంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి, ప్రభుత్వ విద్యా వ్యవస్థకు విరుద్ధం. ఇటువంటి అధికారుల వైఖరి వల్లే ప్రభుత్వ పాఠశాలలు బలహీనపడి, ప్రైవేటు విద్యా వ్యవస్థ మరింత విస్తరించిందన్నారు. డీఈఓ వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి, విధుల్లో నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం, ప్రైవేటు విద్యాసంస్థలకు అనుకూలంగా వ్యవహరించిన అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సూర్యాపేట జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ను వెంటనే సస్పెండ్ చేసి, స్వతంత్ర విచారణ నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే సమయంలో జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల వసూళ్లు, పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలు, ఇతర అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు నిర్వహించి, విద్యా చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎస్.యు రాష్ట్ర నాయకులు ఎం హరీష్, జిల్లా కన్వీనర్ బి కుమార్, నాయకులు మచ్చ వంశీ, మధు పాల్గొన్నారు.



## ఆహార కల్తీకి చెక్.. ఆరోగ్యకర జీవనానికి ఫార్మర్ స్టోర్స్ తోడ్పాటు: ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

**నిజామాబాద్, జూలై 18**

రోజురోజుకూ పెరుగుతున్న ఆహార కల్తీ, నిల్వ కోసం ఆహార పదార్థాల్లో కలుపుతున్న రసాయనాలు ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయని నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవడం ప్రతి కుటుంబ బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లో ఫార్మర్ స్టోర్స్ -- ఇషా నేచురల్స్ స్టోర్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, మనం నిత్యం ఉపయోగించే పసుపు, కారం, పిండి పదార్థాలు, రవ్వలు, ఇతర వంటసామగ్రిని కడిగి వినియోగించే అవకాశం ఉండదని, వాటిని ఎక్కువకాలం నిల్వ ఉంచేందుకు కలిపే రసాయన పరిరక్షకాలు (ప్రిజర్వేటివ్స్) ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల నుంచి నేరుగా సేకరించిన నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను సంప్రదాయ పద్ధతిలో ప్రాసెస్ చేసి వినియోగదారులకు అందించడం అభినందనీయమని చెప్పారు. ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను వినియోగించడం ద్వారా కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని ఆయన సూచించారు. ఫార్మర్ స్టోర్స్‌లో వుడ్ ప్రెస్డ్ ఆయిల్స్, మిల్లెట్స్, మిల్లెట్ రవ్వలు, మిల్లెట్‌తో తయారైన ఆహార పదార్థాలు, ఆరోగ్యకరమైన స్నాక్స్, స్వీట్స్, డ్రైఫ్రూట్ లడ్డూలు, వివిధ రకాల కిచెన్ అవసరాల నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇషా నేచురల్స్ యజమానులు లవంగ జోష్న, విశాల్, వారి కుటుంబ సభ్యులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.






## సోనమ్ వాంగ్చుక్ దీక్షకు సంఘీభావంగా టీఆర్పీ ర్యాలీ

**జనగామ, జూలై 18**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్చుక్‌కు సంఘీభావంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) ఆధ్వర్యంలో శనివారం జనగామలో ర్యాలీ నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు కట్ల సదానందం ముదిరాజ్, జిల్లా యువజన అధ్యక్షుడు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర నాయకుడు మాచర్ల భిక్షపతి మాట్లాడుతూ, దేశంలోని విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే పోటీ పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని అన్నారు. పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్‌టీఏను రద్దు చేసి విద్యార్థుల ప్రయోజనాలను కాపాడే విధంగా కొత్త పరీక్షల వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ర్యాలీలో నియోజకవర్గ ఇన్‌చార్జి సీసా శ్రీధర్ గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గడ్డం కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు బోడ రమేష్ నేత, జిల్లా మహిళా అధ్యక్షురాలు దండు రాణి, సీనియర్ నాయకుడు మంద దిలీప్, యువజన ఉపాధ్యక్షుడు గంగరాజు, ధీరోజు లక్ష్మి, మంద సాయి, ఎం.డి. సల్మాన్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దండు మైలారం భూకబ్జాలపై టీఆర్పీ ఆందోళన

**ఇబ్రహింపట్నం, జూలై 18**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహింపట్నం మండలం దండు మైలారం గ్రామంలో ప్రభుత్వ, చెరువు భూములపై అక్రమ కబ్జాలు జరిగాయని ఆరోపిస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) నాయకులు శనివారం ఆందోళన నిర్వహించారు. కబ్జాకు గురైన భూములను పేదలకు తిరిగి అప్ప గించే వరకు రాజీలేని పోరాటం కొనసా గిస్తామని పార్టీ మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామంలో గత అనేక సంవత్సరా లుగా భూకబ్జాలు, అధికా ర దుర్వినియోగం జరుగుతున్నాయని ఆరో పించారు. గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ వచ్చిన ప్పటికీ స్థానిక రాజకీయాలపై కొందరు పెత్తందా ర్లు ఆధిపత్యం కొనసాగిస్తున్నారని విమర్శించా రు. సుమారు





నాలుగు ఎకరాల గ్రామకంఠం భూమితో పాటు శ్మశాన వాటిక సమీపంలోని ఐదు ఎకరాల బతుకమ్మ చెరువు భూమిని అక్రమంగా ఆక్రమించారని ఆరోపిస్తూ, సంబంధిత అధికార యంత్రాంగం వెంటనే విచారణ జరిపి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు గ్రామాన్ని సంద ర్శించి బాధితులతో సమావే శమయ్యారు. భూములు కోల్పోయి నట్లు చెబుతున్న గ్రామ స్థల సమస్యలను తెలుసుకుని, వారికి న్యాయం జరిగేలా చట్టపరంగా మరియు ప్రజా ఉద్యమాల ద్వారా పోరాటం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి భూకబ్జాలకు వ్యతిరే కంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మం లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేములవాడ మదన్‌మోహన్ చారి, రాష్ట్ర నాయకులు పిట్టల శంకరన్న, రాష్ట్ర సహాయ కార్యదర్శి బిక్షపతి గౌడ్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బత్తిని మీనాక్షి గౌడ్, మహిళా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పుష్పలీల, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నీట్ బాధితులకు రూ.1 కోటి పరిహారం ఇవ్వాలి: టీఆర్పీ

**కాక్రోజ్ జనతా పార్టీ ఉద్యమానికి కరీంనగర్‌లో భారీ సంఘీభావ ర్యాలీ**

**కరీంనగర్, జూలై 18**

ఢిల్లీలో కాక్రోజ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉద్యమానికి మద్దతుగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనంతరం మీడియా సమావేశం నిర్వహించా రు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా మాట్లాడుతూ, నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలు, నిర్లక్ష్యం కారణంగా దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపో యాయని అన్నారు. ఈ ఘటనకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశా రు. నీట్ పరీక్షల అవకతవకల వల్ల నష్టపోయిన ప్రతి విద్యార్థి కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం వెంటనే ప్రకటించాలని ఆయన కోరారు. అలాగే ఈ వ్యవహారంపై నైతిక బాధ్య త వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనా మా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే విధానాలను తెలంగాణ రాజ్యాధికార పార్టీ తీవ్రంగా వ్యతిరేకి స్తుందని, విద్యను కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టి సామాన్య, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు అన్యాయం చేయడం సరికాదన్నారు. ప్రజల హక్కులు, విద్యార్థుల భవిష్యత్తు, సామా జిక న్యాయం కోసం జరిగే ప్రతి ఉద్యమానికి టీఆర్పీ అండగా ఉంటుందని, అవస రమైతే రాష్ట్ర వ్యాప్తంగా మరింత ఉధృతంగా ఆందో ళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ దేవి, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ వాజిద్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీకాంత్, టౌన్ ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్, మండల అధ్యక్షులు శివరాత్రి మోహన్, ఓర్సు రాజు, ఓర్సు విమలతో పాటు పార్టీ నాయకులు మహబూబ్ అలీ, కోరే




గంగ, గుండోజు పద్మ, నేదునూరి రాజు, నేదునూరి కుమారస్వామి, గుండోజు సదానందం, దారంగుల గణేష్, మోహన్, మధు, ధర్మారపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న సమక్షంలో టీఆర్పీలో భారీ చేరికలు

**హనుమకొండలో పార్టీలో చేరిన హరిగొప్పుల వేణు, అనిల్**

**హనుమకొండ, జూలై 18**



తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) బలోపేతమే లక్ష్యంగా పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, సమక్షంలో శనివారం పలువురు నాయకులు పార్టీలో చేరారు. హనుమకొండ జిల్లాకు చెందిన హరిగొప్పుల వేణు, అనిల్, టీఆర్పీలో చేరగా, వారికి తీన్మార్ మల్లన్న పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన హరిగొప్పుల వేణు, అనిల్ మాట్లాడుతూ, తీన్మార్ మల్లన్న ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ జిల్లాలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం సాధన కోసం టీఆర్పీ చేపడుతున్న ఉద్యమాలకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న తీన్మార్ మల్లన్న నాయకత్వంపై విశ్వాసంతో యువత, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి పెద్ద ఎత్తున చేరుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ మరింత బలోపేతం అవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బండారపు రాంనర్సయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క, మహిళా క్రమశిక్షణ కమిటీ చైర్మన్లు మీనా గౌడ్, పుష్పలీల, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకటేష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పూజారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పుట్టరాజు, జిల్లా కార్యదర్శులు ముడిదే శ్రీనివాస్, శిఖరం అనిల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో నిరుద్యోగులకు అన్యాయం

**తీన్మార్ మల్లన్న**

**హైదరాబాద్, జూలై 18**

ఈడబ్ల్యూఎస్ (జుఔ) రిజర్వేషన్ల అమలు వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపించారు. సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగుల సమస్యలపై మాట్లాడుతున్నట్లు కనిపిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వాస్తవానికి అగ్రవర్ణాల ప్రయోజనాలకే పనిచేస్తున్నాయని విమర్శించారు. మండల్ కమిషన్ సిఫాం్సల మేరకు బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలులోకి వచ్చినప్పటికీ, మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరా దనే నిబంధనతో బీసీలకు పూర్తి న్యాయం జరగలేదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో అధిక రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో విఫలమైందని ఆరోపించారు. 2019లో 103వ రాజ్యాంగ సవరణ ద్వారా అగ్రవర్ణాల ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వే షన్ కల్పించిన విధానాన్ని ప్రస్తావి స్తూ, ఓపెన్ కేటగిరీ పోస్టుల నుంచే ఈ కోటా అమలు చేయాల్సి ఉండగా, తెలంగా ణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో నెం.65 ద్వారా మొత్తం పోస్టులపై నేరుగా 10 శాతం అమలు చేసిందని విమర్శించారు. దీంతో ఓపెన్ కేటగిరీలో మెరిట్ ఆధారంగా అవకాశాలు పొందే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు నష్టం జరుగుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే ప్రకారం ఓసీ జనాభాలో ఈడబ్ల్యూఎస్‌కు అర్హులైన వారి శాతం 5.36 మాత్రమే ఉన్నప్పటికీ వారికి 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారని, మరోవైపు 56.33 శాతం జనాభా ఉన్న బీసీలకు కేవలం 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా వారి జనాభా నిష్పత్తికి తగ్గ రిజర్వే షన్లు లేవని అన్నారు. నిరుద్యోగుల పక్షాన మాట్లాడుతున్న కేటీఆర్ తమ ప్రభుత్వమే జీవో 65 తీసుకొచ్చిన విషయాన్ని చెప్పడం లేదని, సమగ్ర కుల సర్వే వివరాలు తెలిసినా కాంగ్రెస్ ప్రభు త్వం కూడా ఈడబ్ల్యూఎస్ విధానాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. తెలంగాణలో జీవో నెం.65 ను వెంటనే రద్దు చేసి, ఆ తర్వాతే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని



డిమాండ్ చేశారు. జనాభా నిష్పత్తి ప్రకా రమే రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీ ప్రభుత్వం ఏర్పడితేనే సామాజిక న్యాయం సాధ్యమ వుతుందని ఆయన అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దు కోసం నిరుద్యోగులంతా ఏకమై పోరా డాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతకు న్యాయం జరిగేలా తెలంగాణ రాజ్యాధికార పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తీన్మార్ మల్లన్న తెలిపారు.



## సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష భగ్నంపై మెదక్‌లో భగ్గుమన్న టీఆర్పీ

**తీన్మార్ మల్లన్న పిలుపుతో భారీ సంఘీభావ ర్యాలీ.. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్**

**మెదక్, జూలై 18**

లడఖ్ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఢిల్లీలో చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేయడాన్ని ఖండిస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో మెదక్ జిల్లాలో భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఇమాంపురం యాదగిరి గౌడ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఇమాంపురం యాదగిరి గౌడ్ మాట్లాడుతూ, దేశ ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న ఉద్యమకారుల గొంతు నొక్కివేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను అడ్డుకోవడం, దీక్షను భగ్నం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థలో జరుగుతున్న అవకతవకలు, పరీక్షల పేపర్ లీకేజీలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (చీూ) ను రద్దు చేసి పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడితే తెలంగాణ రాజ్యాధికార పార్టీ చూస్తూ ఊరుకోదని, తీన్మార్ మల్లన్న నాయకత్వంలో దేశవ్యాప్తంగా జరిగే ప్రజా ఉద్యమాలకు టీఆర్పీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కంచర్ల సిద్దా గౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సిద్ధక్క, యూత్ ప్రెసిడెంట్ పోతుల రవీందర్, విద్యార్థి విభాగం నాయకుడు పులిమామిడి గౌతమ్ రాజు, పార్టీ నాయకులు కూతురు రాణి, పుష్ప, చంద్రశేఖర్ గౌడ్, తిరుపతి, రాజయ్య, మల్లేష్, రేణుక తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముస్లింల సమస్యల పరిష్కారమే ధ్యేయం

**తెలంగాణ ముస్లిం లీగ్, సామాజిక తెలంగాణ ఇంటెలెక్చువల్ ఫోరం, టిబీసీఈఎఫ్ నేతలు**

**మనదీపం జూలై 18 :**



రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం, సామాజిక న్యాయం, కార్మిక, ఉద్యోగ రంగాల్లో ముస్లిం సమాజం ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారంపై తెలంగాణ ముస్లిం లీగ్, సామాజిక తెలంగాణ ఇంటెలెక్చువల్ ఫోరం తెలంగా ణ బ్యాక్వర్డ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నేతలు కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ముస్లిం లీగ్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ షకీల్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ మసూద్ అలీ, ప్రధాన కార్యదర్శి సమ్మయ్య దేవళ్ల, అధ్యక్షుడు సతీష్ కొట్టె పాల్గొని పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముస్లిం సమాజానికి చెందిన ప్రముఖులు గౌస్ భాయ్, వహీద్ భాయ్ ఈ సమావేశాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాలతో పాటు మైనారిటీల, ముఖ్యంగా ముస్లిం సమాజం సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. ముస్లిం యువతకు ఉపాధి, విద్యా అవకాశాలు పెంపొం దించడంతో పాటు కార్మిక హక్కులు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు అన్ని సంఘాలు కలిసి కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉ oదని అభిప్రాయ పడ్డారు. రాబోయే రోజుల్లో సామాజిక న్యాయం సాధన కోసం ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగాలని నిర్ణయించినట్లు నేతలు తెలిపారు. సమావే శం విజయవంతం కావడానికి చొరవ చూపిన గౌస్ భాయ్, వహీద్ భాయ్‌లను పలువురు నాయకులు అభినందించారు. ఈ సమావేశం మైనారిటీల సమస్యల పరిష్కారానికి, సామాజిక న్యాయం కోసం వివిధ సంఘాల మధ్య సమన్వయానికి దోహదపడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి

**హైదరాబాద్, జూలై 18**

తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరికల పరంపర కొనసాగుతోంది. హన్మకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూజారి సత్యనారాయణ ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లాకు చెందిన హరిగొ ప్పుల వేణు, ఎస్. అనిల్ పార్టీ తీర్థం పుచ్చుకు న్నారు. పార్టీ కేంద్ర కార్యా లయంలో నిర్వహించిన కార్యక్ర్మం లో పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీనా ్మర్ మల్లన్న వారికి పార్టీ కండువా కప్పి సాద రంగా ఆహ్వానించారు. ఈ సంద ర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, తీన్మార్ మల్ల న్న నాయ కత్వం, బీసీల రాజ్యాధికార సాధన లక్ష్యాలు, ప్రజా సమస్యల పరిష్కా రం కోసం పార్టీ చేపడుతు న్న ఉద్యమాలకు ఆకర్షితులై తెలంగాణ రాజ్యా ధికార పార్టీలో చేరిన ట్లు తెలిపా రు. పార్టీ బలోపేతా నికి కృషి చేస్తామని, హన్మ కొండ జిల్లాలో పార్టీ విస్తరణకు అంకితభా వంతో పనిచేస్తా మని పేర్కొన్నా రు. ఈ కార్య క్రమంలో హన్మ



కొండ జిల్లా అధ్యక్షు డు బత్తిని వెంకటేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట రాజు తదితరులు పాల్గొన్నారు.

## బయటి ఆహారంతో నర్సింగ్ విద్యార్థులకుఅస్వస్థత

**సూర్యాపేట, జూలై 18**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఎనిమిది మంది విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురైనట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ వెంకటరమణ తెలిపారు. అయితే, హాస్టల్ భోజనం వల్ల కాకుండా విద్యార్థులు బయట నుంచి తెచ్చుకున్న ఆహారం తీసుకోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని వెల్లడించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను వెంటనే సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. వారిలో ముగ్గురు విరేచనాలు, మరో ముగ్గురు జ్వరంతో బాధపడుతుండగా, మిగిలిన ఇద్దరికి స్వల్ప అస్వస్థత ఉన్నట్లు పేర్కొన్నారు.



# రోహిత్ రిటైర్మెంట్‌పై బీసీసీఐ స్పష్టత

లండన్, జులై 18

భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నారనే ప్రచారంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) స్పష్టత ఇచ్చింది. ఇంగ్లండ్‌తో ఆదివారం లార్డ్స్‌లో జరిగే వన్డే మ్యాచ్ రోహిత్ శర్మ కెరీర్‌లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ కాదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. ఈ విషయంలో వస్తున్న వార్తలకు ఎలాంటి ఆధారం లేదని ఆయన పేర్కొన్నారు. రోహిత్ శర్మ భారత వన్డే జట్టులో కీలక సభ్యుడని, దేశానికి ఆయన మరికొంత కాలం సేవలు అందిస్తారని సైకియా వెల్లడించారు. లార్డ్స్ వన్డే తర్వాత రోహిత్ రిటైర్మెంట్‌పై ఎలాంటి చర్చలు జరగలేదని, మీడియాలో వస్తున్న కథనాలు కేవలం ఊహాగానాలేనని ఆయన స్పష్టం చేశారు. చాంపియన్స్ ట్రోఫీ విజయం తర్వాత రోహిత్ శర్మ 14 వన్డే ఇన్నింగ్స్‌ల్లో 589 పరుగులు సాధించాడు. ఈ కాలంలో ఆయన 45.3 సగటుతో, 92.03 స్ట్రైక్‌రేట్‌తో ఒక శతకం, నాలుగు అర్ధశతకాలు నమోదు చేశాడు. గణాంకాల పరంగా ఆయన ప్రదర్శన కెరీర్ సగటుకు దగ్గరగానే ఉన్నప్పటికీ, గతంలో కనిపించిన దూకుడు మాత్రం తగ్గిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2023 వన్డే ప్రపంచకప్‌లో 54.27 సగటు, 125.94 స్ట్రైక్‌రేట్‌తో ఆడిన రోహిత్ భారత్‌ను ఫైనల్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే ఇటీవలి మ్యాచ్‌ల్లో ఆ స్థాయి దూకుడు కనిపించడం లేదని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతి ఇన్నింగ్స్‌లో ఒత్తిడిని ఎదుర్కొంటూ ఆడుతున్నట్లు ఆయన ఆటతీరు సూచిస్తోందని పేర్కొంటున్నారు. మరోవైపు భారత జట్టులో ఓపెనర్ స్థానానికి పోటీ మరింత పెరుగుతోంది. యువ ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్ వరుసగా నిలకడైన ప్రదర్శన చేస్తుండటంతో జట్టులో స్థానం కోసం పోటీ తీవ్రంగా మారింది. జైస్వాల్ ఇటీవల మూడు వన్డేల్లో రెండు శతకాలు నమోదు చేయగా, రుతురాజ్ కూడా దక్షిణాఫ్రికాపై శతకం సాధించి తన సామర్థ్యాన్ని నిరూపించాడు. అయినప్పటికీ, రోహిత్ శర్మపై జట్టు యాజమాన్యానికి పూర్తి విశ్వాసం ఉందని బీసీసీఐ తాజా ప్రకటనతో మరోసారి స్పష్టమైంది.

# మెస్సీపై షకీరా ప్రశంసల జల్లు

న్యూయార్క్, జులై 18

ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా ప్రపంచకప్--2026 ఫైనల్‌కు ముందు అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సీపై అంతర్జాతీయ పాప్ గాయని షకీరా ప్రశంసల వర్షం కురిపించారు. స్పెయిన్‌తో ఆదివారం జరిగే టైటిల్ పోరుకు ముందు మెస్సీకి ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. మెస్సీ అసాధారణ ప్రతిభ కలిగిన ఆటగాడని, అతని క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని షకీరా పేర్కొన్నారు. వయసు లేదా విమర్శలు ఏ వ్యక్తి సామర్థ్యాన్ని నిర్ణయించలేవని, తన ఆటతో మెస్సీ మరోసారి నిరూపిస్తున్నాడని ఆమె వ్యాఖ్యానించారు. మెస్సీ విజయాల వెనుక అతని భార్య ఆంటోనెలా కీలక పాత్ర పోషిస్తున్నారని కూడా షకీరా తన పోస్టులో ప్రస్తావించారు. కుటుంబ సభ్యుల అండ, ముఖ్యంగా జీవిత భాగస్వామి ప్రోత్సాహం వల్లే మెస్సీ మైదానంలో మరింత ఆత్మవిశ్వాసంతో రాణిస్తున్నాడని ఆమె అభిప్రాయపడ్డారు. షకీరా చేసిన ఈ పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఆమె వ్యాఖ్యలను ప్రశంసిస్తూ విస్తృతంగా పంచుకుంటున్నారు. ఈ పోస్టుపై మెస్సీ భార్య ఆంటోనెలా కూడా స్పందించారు. షకీరాకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆమె తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఆ పోస్టును రీషేర్ చేశారు. దీంతో ఇద్దరు ప్రపంచ ప్రఖ్యాత సెలబ్రిటీల పోస్టులు సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారితీశాయి. మెస్సీ, ఆంటోనెలా చిన్ననాటి స్నేహితులు. చాలా సంవత్సరాల ప్రేమ అనంతరం 2017లో వివాహం చేసుకున్న ఈ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఫైనల్ మ్యాచ్‌కు ముందు షకీరా చేసిన ప్రశంసలు, ఆంటోనెలా స్పందనతో అర్జెంటీనా అభిమానుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. ప్రస్తుతం ప్రపంచ దృష్టి అంతా అర్జెంటీనా–స్పెయిన్ మధ్య జరగనున్న ప్రతిష్ఠాత్మక ఫైనల్‌పైనే నిలిచింది.





# ఫిఫా ప్రపంచకప్ ఘన విజయంపై ట్రంప్, ఇన్ఫాంటినో ప్రశంసలు

న్యూయార్క్, జులై 18

ఫిఫా ప్రపంచకప్–2026 టోర్నమెంట్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్ఫాంటినో ప్రశంసలతో ముంచెత్తారు. న్యూయార్క్‌లోని ట్రంప్ టవర్‌లో నిర్వహించిన అధికారిక ఫిఫా కార్యక్రమంలో పాల్గొన్న ఇద్దరూ ఈ మెగా టోర్నీ ప్రపంచ క్రీడా చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిందని పేర్కొన్నారు. ట్రంప్ మాట్లాడుతూ, ప్రపంచకప్ అభిమానులకు ఎన్నో మరపురాని క్షణాలను అందించిందన్నారు. టోర్నీలో అమెరికా ఆటగాడు ఫోలారిన్ బలోగన్‌పై విధించిన రెడ్‌కార్డు నిషేధాన్ని ఫిఫా నిబంధనల ప్రకారం రద్దు చేయడంతో అతడు బెల్జియంతో జరిగిన రౌండ్ ఆఫ్–16 మ్యాచ్‌లో ఆడే అవకాశం లభించిందని గుర్తు చేశారు. ఆ మ్యాచ్‌లో అమెరికా పరాజయం పాలైన విషయాన్ని ప్రస్తావించారు. భవిష్యత్తులో ప్రపంచకప్‌ను మెక్సికో, కెనడా భాగస్వామ్యం లేకుండా అమెరికా ఒక్కటే నిర్వహించినా, లేదా చైనాతో కలిసి సంయుక్తంగా ఆతిథ్యం ఇచ్చినా ఆసక్తికరంగా ఉంటుందని ట్రంప్ సరదాగా వ్యాఖ్యానించారు. ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్ఫాంటినో మాట్లాడుతూ, ప్రపంచకప్ కేవలం ఫుట్‌బాల్ టోర్నీ మాత్రమే కాదని, ప్రపంచాన్ని ఒక్కతాటిపైకి తీసుకొచ్చే గొప్ప సామాజిక, సాంస్కృతిక వేడుకగా నిలిచిందన్నారు.







# ఫిఫా ఫైనల్ టికెట్‌కు రూ.27 లక్షలు..!

న్యూయార్క్, జులై 18

ఫిఫా ప్రపంచకప్--2026 తుది దశకు చేరుకుంది. ఆదివారం న్యూయార్క్‌లోని మెట్‌లైఫ్ స్టేడియంలో అర్జెంటీనా, స్పెయిన్ జట్లు ప్రతిష్ఠాత్మక ఫైనల్‌లో తలపడనున్నాయి. ఈ హోరాహోరీ పోరును ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదే సమయంలో ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ ధర మరో సంచలనంగా మారింది. అత్యున్నత హాస్పిటాలిటీ టికెట్ ధర ఏకంగా రూ.27 లక్షలకు చేరుకుని ఫిఫా ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన టికెట్‌గా నిలిచింది.ఒఓ అంతర్జాతీయ క్రీడా మీడియా నివేదిక ప్రకారం, అత్యున్నత శ్రేణి హాస్పిటాలిటీ ప్యాకేజీ ధర సుమారు రూ.27 లక్షలు. ఈ ప్యాకేజీలో మ్యాచ్‌ను వీక్షించే అవకాశం మాత్రమే కాకుండా విలాసవంతమైన లాంజ్‌లు, ప్రత్యేక అతిథి సేవలు, అత్యున్నత స్థాయి విందు, కార్పొరేట్ అతిథులకు ప్రత్యేక సౌకర్యాలు కూడా అందుబాటులో ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వీఐపీలు, వ్యాపారవేత్తలను దృష్టిలో ఉంచుకుని ఫిఫా ఈ ప్రత్యేక ప్యాకేజీలను రూపొందించింది.

# రోహిత్ రిటైర్మెంట్‌పై కపిల్ దేవ్ స్పందన

లండన్, జులై 18



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై జరుగుతున్న ఊహాగానాల నేపథ్యంలో భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ స్పందించారు. రోహిత్ ఎప్పుడైనా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా అది బాధపడాల్సిన సందర్భం కాదని, అతడి అద్భుతమైన కెరీర్‌ను సంబరంగా గుర్తు చేసుకోవాల్సిన క్షణమని అభిప్రాయపడ్డారు. లార్డ్స్‌లో ఇంగ్లండ్‌తో జరగనున్న మూడో వన్డే రోహిత్‌కు చివరి అంతర్జాతీయ మ్యాచ్ కావొచ్చన్న ప్రచారం నేపథ్యంలో కపిల్ దేవ్ మాట్లాడుతూ, ప్రతి క్రికెటర్ ఏదో ఒకరోజు ఆటకు వీడ్కోలు చెప్పక తప్పదని అన్నారు. “బాధ ఎందుకు? ఇన్నేళ్లుగా రోహిత్ మనందరికీ ఎన్నో మధురమైన క్షణాలు అందించాడు. సునీల్ గవాస్కర్, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, సచిన్ టెండూల్కర్ వంటి దిగ్గజాలు కూడా ఒకరోజు రిటైర్ అయ్యారు. అలాగే రోహిత్ కూడా ఎప్పుడో ఒకరోజు వీడ్కోలు చెబుతాడు. దాన్ని బాధగా కాకుండా గర్వంగా గుర్తు చేసుకోవాలి” అని కపిల్ దేవ్ అన్నారు. రోహిత్ భారత క్రికెట్‌కే కాకుండా ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించాడని కొనియాడారు. అలాంటి ఆటగాడి ప్రయాణాన్ని సంబరంగా జరుపుకోవాలని, అతడి సేవలను గుర్తుంచుకోవాలని సూచించారు.



# జపాన్ ఓపెన్ ఫైనల్లోకి పీవీ సింధు

టోక్యో, జులై 18

భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు సుదీర్ఘ విరామం తర్వాత మరోసారి అద్భుత ప్రదర్శనతో మెరిసింది. జపాన్ ఓపెన్ సూపర్ సిరీస్ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో చైనా స్టార్, టోక్యో ఒలింపిక్స్ ఛాంపియన్ చెన్ యుఫీపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. గత రెండేళ్లలో సింధు ఒక ప్రధాన అంతర్జాతీయ టోర్నీలో ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి. ప్రపంచ 12వ ర్యాంకర్ సింధు, నాలుగో ర్యాంకర్ చెన్ యుఫీ మధ్య జరిగిన సెమీఫైనల్ పోరు హోరాహోరీగా సాగింది. తొలి గేమ్‌లో ఇద్దరూ సమానంగా పోటీపడగా, సింధు 21–19తో ఆధిక్యం సాధించింది. రెండో గేమ్‌లో కూడా అదే జోరును కొనసాగించిన ఆమె 15–10తో ముందంజలో నిలిచింది. ఈ సమయంలో చెన్ యుఫీ హ్యామ్‌స్ట్రింగ్ గాయానికి గురైంది. వైద్యుల చికిత్స అనంతరం కూడా ఆట కొనసాగించలేక మ్యాచ్ మధ్యలోనే రిటైర్డ్ హర్ట్‌గా వైదొలిగింది. దీంతో సింధు విజేతగా నిలిచి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో సింధు తన పాత దూకుడును ప్రదర్శించింది. శక్తివంతమైన స్మాష్‌లు, కచ్చితమైన షాట్లతో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచింది. తొలి గేమ్‌లో 18–18తో స్కోరు సమంగా ఉన్న సమయంలో జరిగిన 51 షాట్ల సుదీర్ఘ ర్యాలీని సింధు గెలుచుకోవడం మ్యాచ్‌కు హైలైట్‌గా నిలిచింది. మ్యాచ్ అనంతరం సింధు మాట్లాడుతూ, స్కోరు గురించి ఆలోచించకుండా ప్రతి పాయింట్‌పైనే దృష్టి పెట్టాలని తన కోచ్ సూచించారని తెలిపింది. ఆ సలహా తన ఆటతీరును మార్చిందని, ప్రశాంతంగా ఆడేందుకు ఎంతో ఉపయోగపడిందని పేర్కొంది. 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీ టైటిల్ గెలిచిన తర్వాత సింధు మళ్లీ ఫైనల్‌కు చేరడం ఇదే మొదటిసారి. అలాగే గత నాలుగు మ్యాచ్‌ల్లో చెన్ యుఫీ చేతిలో ఎదురైన పరాజయాలకు కూడా ఈ విజయంతో తెరపడింది. ఆదివారం జరిగే ఫైనల్లో జపాన్‌కు చెందిన అకానె యమగూచి లేదా ఇండోనేషియాకు చెందిన పుత్రి కుసుమ వర్దానితో సింధు టైటిల్ కోసం తలపడనుంది. మరోసారి అంతర్జాతీయ టైటిల్‌ను సొంతం చేసుకోవాలని భారత అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



# రష్మిక అంకితభావానికి బృందా మాస్టర్ ప్రశంసలు

**స్టార్ కథానాయిక రష్మిక మందన్న అంకితభావం, క్రమశిక్షణే ఆమె విజయానికి ప్రధాన కారణమని ప్రముఖ నృత్య దర్శకురాలు బృందా మాస్టర్ ప్రశంసించారు. ప్రస్తుతం దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న 'మైసా' చిత్రంలోని ఓ పాటకు నృత్య దర్శకత్వం వహిస్తున్న ఆమె, రష్మిక పనితీరును కొనియాడుతూ సామాజిక మాధ్యమాల్లో భావోద్వేగపూరిత సందేశాన్ని పంచుకున్నారు.**

**హైదరాబాద్, జులై 18**

రిహార్సల్స్ నుంచి చిత్రీకరణ వరకు రష్మిక చూపిన కష్టపడే తత్వం తనను ఎంతగానో ఆకట్టుకుందని బృందా మాస్టర్ తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా సినీ పరిశ్రమలో ఉన్నప్పటికీ ఇంత క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే కథానాయికలు చాలా అరుదుగా కనిపిస్తారని పేర్కొన్నారు. తాను సూచించిన ప్రతి మార్పును చిరునవ్వుతో స్వీకరించి వెంటనే అమలు చేయడం రష్మిక ప్రత్యేకత అని ఆమె ప్రశంసించారు.

శారీరకంగా నొప్పితో ఉన్న సందర్భాల్లో కూడా రష్మిక తన దృష్టిని పనిపై నుంచి మరల్చలేదని బృందా మాస్టర్ వెల్లడించారు. సినిమా కోసం ఆమె చేసిన శ్రమ తెరపై ప్రతి ప్రేక్షకుడికి స్పష్టంగా కనిపిస్తుందని, ఈ పాత్ర కోసం రష్మిక ఎంతో కష్టపడిందని పేర్కొన్నారు. ఆమె అంకితభావం యువ నటీనటులకు ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

'మైసా' చిత్రంలో రష్మిక గోండ్ గిరిజన యువతి పాత్రలో కనిపించనున్నారు. భావోద్వేగాలతో పాటు శారీరకంగా కూడా సవాల్ విసిరే పాత్రగా దీనిని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది.

ఈ చిత్రంలో ఈశ్వరి రావు, గురు సోమసుందరం, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తుండగా, అంతర్జాతీయ యాక్షన్ నిపుణుడు ఆండీ లాంగ్ పోరాట సన్నివేశాలను రూపొందిస్తున్నారు.

# గర్భంతోనే యాక్షన్ సన్నివేశాల్లో దీపిక



**ముంబై, జులై 18**

గర్భవతిగా ఉన్నప్పటికీ యాక్షన్ సన్నివేశాల్లో నటించి బాలీవుడ్ కథానాయిక దీపిక పదుకోన్ అరుదైన ఘనత సాధించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారతీయ చలనచిత్ర చరిత్రలో గర్భధారణ సమయంలో షూటింగ్‌లలో పాల్గొన్న నటీమణులు చాలామందే ఉన్నప్పటికీ, గర్భంతోనే కఠినమైన యాక్షన్ సన్నివేశాల్లో నటించడం మాత్రం అత్యంత అరుదైన విషయంగా భావిస్తున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్ కథానాయకుడిగా, దర్శకుడు అట్లీ రూపొం దిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా'లో దీపిక కథానాయికగా నటిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన కీలక యాక్షన్ ఘట్టాలను దర్శకుడు అట్లీ చిత్రీకరించినట్లు సమాచారం. రెండో సంతానానికి జన్మనివ్వబోతున్న దీపిక, గర్భంతోనే ఈ సన్నివేశాల్లో పాల్గొనడం సినీ పరిశ్రమలో ఆసక్తికరంగా మారింది. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, ప్రత్యేక జాగ్రత్తల నడుమ ఈ చిత్రీకరణ నిర్వహించినట్లు తెలుస్తోంది. వృత్తిపట్ల ఆమె చూపిన అంకితభావాన్ని చిత్రబృందం ప్రశంసించినట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. తాను పాటించే ఎనిమిది గంటల పని విధానాన్ని దీపిక పక్కన పెట్టినట్లు సమాచారం. మాతృత్వ విరా మానికి వెళ్లే ముందు 'రాకా'లో తనకు సంబంధించిన చిత్రీకరణను పూర్తిచేయా లని ఆమె నిర్ణయించుకున్నట్లు తెలుస్తో షూటింగ్‌లో పాల్గొంటూనే తన తొలి కుమార్తె దువా సంరక్షణ బాధ్యత లను కూడా సమర్థంగా నిర్వర్తిస్తూ నటిగా, తల్లిగా రెండు పాత్రలను సమానంగా నిర్వహిస్తున్నారని చిత్రబృందం తెలిపినట్లు సమాచారం.

# 'లెనిన్' విజయోత్సవానికి మరో వేడుక?

**హైదరాబాద్, జులై 18**



అక్కినేని అఖిల్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన 'లెనిన్' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. భావోద్వేగాలు, యాక్షన్ ప్రధానంగా తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుని అఖిల్ సినీ ప్రస్థానంలో మరో విజయవంతమైన చిత్రంగా నిలిచింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని చిత్రబృందం ఇప్పటికే గుంటూరులో నిర్వహించిన విజయోత్సవ సభకు మంచి స్పందన లభించింది. తాజాగా ఈ చిత్ర విజయాన్ని మరింత ఘనంగా జరుపుకునేందుకు మరో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. జులై 20న ఈ కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ వేడుకలో చిత్రబృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొనే అవకాశం ఉందని తెలుస్తోంది.

# రూ.100 కోట్ల క్లబ్‌లోకి 'ధమాల్--4'


**ముంబై, జులై 18**

బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటించిన హాస్య వినోద చిత్రం 'ధమాల్--4' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, ప్రేక్షకుల ఆదరణతో ఈ చిత్రం వసూళ్ల పరంగా సత్తా చాటుతోంది. రెండో వారంలోనూ అదే జోరును కొనసాగిస్తూ దేశీయంగా రూ. 100 కోట్ల నికర వసూళ్ల మైలురాయిని అధిగమించింది. రెండో శుక్రవారం ఈ చిత్రం ఆశాజనక వసూళ్లు నమోదు చేయడం సినీ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా రెండో వారానికి సినిమాల వసూళ్లు తగ్గుముఖం పట్టే పరిస్థితి కనిపిస్తుంటే, 'ధమాల్--4' మాత్రం స్థిరమైన ప్రదర్శనతో ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తోంది. వారాంతంలో వసూళ్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇటీవలి కాలంలో విడుదలైన పలువురు బాలీవుడ్ అగ్ర హీరోల చిత్రాలు ప్రారంభ రోజుల్లోనే జోరు చూపి, ఆ తర్వాత వేగంగా తగ్గిపోయాయి.




# కథల ఎంపికలో కృతి కొత్త నిర్ణయం

**ముంబయి, జులై 18**



బాలీవుడ్ కథానాయిక కృతి సనన్ తన సినీ ప్రస్థానంలో ఇప్పుడు కొత్త దశలో ఉన్నట్లు తెలిపారు. కెరీర్ ప్రారంభం లో వచ్చిన ప్రతి అవకాశాన్ని స్వీకరించినప్పటికీ, ఇప్పుడు మా త్రం కథ బలంగా ఉంటేనే సినిమాలకు అంగీకరిస్తున్నట్లు వెల్లడించారు. సంఖ్య కంటే నాణ్యతకే ప్రాధాన్యం ఇస్తున్నానని, మంచి పాత్రల ద్వారానే ప్రేక్షకుల ముందుకు రావాలని కోరుకుంటు న్నానని ఆమె చెప్పారు. తెలుగులో 'నేనొక్కడినే' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన కృతి సనన్, ఆ తర్వాత హిందీ చిత్రసీమలో అగ్ర కథానాయికగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రారంభ రోజుల్లో అవకాశాలు కోల్పోకూడదనే ఉద్దేశంతో వరుసగా సినిమాలు చేసిన ఆమె, ప్రస్తుతం మాత్రం కథ, పాత్రకు ప్రాధాన్యం ఉన్న చిత్రాలనే ఎంపిక చేసుకుంటున్నట్లు తెలిపారు. ఫలితం గురించి ఆందోళన చెందకుండా తనకు సంతృప్తినిచ్చే కథల్లో నటించడానికే ఆసక్తి చూపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తన కెరీర్ అత్యంత ఆసక్తికరమైన దశలో కొనసాగుతోందని కృతి అన్నారు. ఇప్పటివరకు సాధించిన విజయాలతో ఎంతో సంతోషంగా ఉన్నానని, ఇకపై నటిగా మరింత వైవిధ్యమైన పాత్రలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.



# అవమానాలను అవకాశాలుగా మార్చుకున్నా: భాగ్యశ్రీ

**హైదరాబాద్, జులై 18**

పాఠశాల రోజుల్లో ఇంగ్లిష్ రాక ఎదుర్కొన్న అవమానాలే తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయని, అదే తన విజయానికి బలమైన పునాది అయిందని నటి భాగ్యశ్రీ బోర్సే తెలిపింది. ఇటీవల ఓ కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె తన చిన్ననాటి అనుభవాలు, చదువులో ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించిన తీరును వివరించింది. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో తన బాల్యం గడిచిందని భాగ్యశ్రీ తెలిపింది. మరాఠీ మాధ్యమ పాఠశాలలో చదువుకున్నా నని, అనంత రం తండ్రి ఉద్యోగరీత్యా కుటుంబ మంతా నైజీరియాకు వెళ్లాల్సి వచ్చిందని చెప్పింది. అక్కడ ఇంగ్లిష్ మాధ్యమ పాఠశాలలో చేరిన తర్వాతే అసలు సవాళ్లు మొదలయ్యాయని పేర్కొంది. మరాఠీ, హిందీ తప్ప మరో భాష తెలియకపోవ డంతో పాఠాలు అర్థం చేసుకోవడం కూడా కష్టంగా మారిందని, ఇంగ్లిష్ మాట్లాడలేకపోవడంతో సహ విద్యార్థులు ఎగతాళి చేస్తూ ఆటపట్టించేవారని గుర్తు చేసుకుంది. అలాంటి పరిస్థితుల్లో తాను ఎప్పుడూ నిరుత్సాహపడలేదని భాగ్యశ్రీ చెప్పింది. తనను అవమానించిన ప్రతి మాటను సవాలుగా స్వీకరించి ఇంగ్లిష్‌పై పూర్తిగా దృష్టి పెట్టానని తెలిపింది. ప్రతిరోజూ కొత్త పదాలు నేర్చుకోవడం, పుస్తకాలు చదవడం, ఉపాధ్యాయుల సహాయం తీసుకోవడం ద్వారా కొద్ది కాలంలోనే భాషపై మంచి పట్టు సాధించానని వివరించింది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467